శనివారం 02.08.2025

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 113 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00





నేటి నుంచి అన్నదాత సుఖీభవ కింద రూ.7,000 జమ చేయనున్న చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం, గత ప్రభుత్వ హామీలను మించి రూ.14,000కి పెంచి రైతుకు అండగా నిలుస్తోంది. ఏది రైతు ప్రభుత్వం, ఏది కాదు అన్నది ప్రజలే నిర్ణయించాలి.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ




## లోకేష్ నాయకత్వం...

పారదర్శక పాలనకి పునాది వేస్తున్న లోకేష్ నాయకత్వం

# నేటి ఆశ, రేపటి విజయగాథ !

- ఆగస్టు 2 నుంచి అన్నదాత సుఖీభవ
- రైతుల జీవితాల్లో ఆనందం జల్లు కురిపించనున్న సీఎం చంద్రబాబు
- తెనాలిలో "సుపరిపాలన తొలి అడుగు" కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా, అభివృద్ధి లక్ష్యానికి ప్రతినిధిగా యువత భవిష్యత్తును తీర్చిదిద్దే దిశగా మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషి ప్రజలలో విశ్వాసం నింపుతోంది. "సుపరిపాలన – తొలి అడుగు" కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో విశేష స్పందన కలిగిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రానికి పునర్నిర్మాణ శకం ఆరంభమైందని, ఈ సుపరిపాలనను ప్రజల గడపదాటి ఇంటికీ తీసుకెళ్లే కార్యక్రమమే 'సుపరిపాలన – తొలి అడుగు' అని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ స్పష్టం చేశారు. తెనాలి నియోజకవర్గంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, ఇంటింటికి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన పర్యటించిన ప్రతి గ్రామంలో ప్రజల నుంచి వెలిసిన స్పందన అద్భుతంగా ఉంది. కూటమి ప్రభుత్వ పాలన తీరుపై ప్రజల నమ్మకం మరింత బలపడుతోంది.

శుక్రవారం బుర్రిపాలెం గ్రామంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ గ్రామస్తుల మధ్య విస్తృతంగా పర్యటించారు. ప్రతి ఇంటిని సందర్శిస్తూ, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలుసుకున్నారు. ఎన్టీఆర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక పార్టీ నాయకులు ఎమ్మెల్సీకి ఘనస్వాగతం పలికారు. మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్సీ... "చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రారంభించిన ఈ కార్యక్రమం ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికవుతోంది. తాను పర్యటిస్తున్న ప్రతి గ్రామంలో ప్రజలు సంతోషంగా స్పందిస్తున్నారు. గత పాలనలో కనిపించని పారదర్శకత, వేగవంతమైన అభివృద్ధి ఈ ప్రభుత్వంలో స్పష్టంగా కనిపిస్తోంది" అని తెలిపారు. మిగతా 3లో...



## జాతీయ చలన చిత్ర అవార్డులు..



**దిల్లీ (జర్నలిస్ట్ ఫైల్) :** 71వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్రం ప్రకటించింది. జాతీయ ఉత్తమ చిత్రంగా '12th ఫెయిల్'కు అవార్డు దక్కింది. జాతీయ ఉత్తమ నటుడి అవార్డును ఇద్దరు పంచుకున్నారు. షారుక్ ఖాన్ (జవాన్), విక్రాంత్ మస్సే (12th ఫెయిల్)లు ఎంపికయ్యారు. ఉత్తమ నటిగా 'మిస్సెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' (హిందీ)లో నటనకు రాణీ ముఖర్జీని అవార్డు వరించింది. ఉత్తమ దర్శకుడిగా 'ది కేరళ స్టోరీ'ని తెరకెక్కించిన సుదీప్తో సేన్ దక్కించుకున్నారు.

ఇక ఉత్తమ తెలుగు చిత్రంగా బాలకృష్ణ నటించిన 'భగవంత్ కేసరి'ని అవార్డు వరించింది. ఉత్తమ తమిళ చిత్రంగా 'పార్కింగ్'కు అవార్డు దక్కింది. బెస్ట్ ఫిల్మ్ క్రిటిక్ అవార్డు ఉత్పల్ దత్త (అస్సామీ)కు ప్రకటించారు. మిగతా 3లో...

## సింగపూర్ లో మంత్రి నారాయణ



**సింగపూర్ (జర్నలిస్ట్ ఫైల్) :** అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా నిర్మించేలా అవసరమైన పద్ధతులపై అధ్యయనం చేస్తున్నారు మంత్రి నారాయణ...గత ఆరు రోజులుగా సింగపూర్ లో పర్యటిస్తున్న మంత్రి నారాయణ....వివిధ నిర్మాణాలు,ప్రాజెక్ట్ లను అధ్యయనం చేయడంతో పాటు పలువురు ప్రముఖులతో సమావేశమవుతున్నారు...శుక్రవారం ఉదయం సింగపూర్ లోని %తూాదీూ% వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ను సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుతో కలిసి మంత్రి నారాయణ పరిశీలించారు...ఈ ప్లాంట్ లో ఘన వ్యర్థాలను వివిధ రూపాలుగా మార్చనున్నారు..ఇళ్లు ,,పరిశ్రమల నుంచి సేకరించిన ఘన వ్యర్థాలను అధునాతన టెక్నాలజీతో తయారుచేసిన వాహనాల్లో ఈ ప్లాంట్ కు తరలిస్తారు..ఇక్కడ ప్లాస్టిక్ రీసైక్లింగ్ తో పాటు ఎలక్ట్రానిక్ వ్యర్థాలను రీ సైక్లింగ్ చేయనున్నారు...మిగిలిన ఘన వ్యర్థాలను వేస్ట్ టు ఎనర్జీగా మారుస్తున్నారు...వ్యర్థాల సేకరణ నుంచి వాటిని రీసైక్లింగ్ చేసే వరకూ ఎలాంటి పద్ధతులు అవలంబిస్తున్నారనేది సింగపూర్ అధికారులు మంత్రి నారాయణకు వివరించారు..ఏపీలో కూడా ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది...ఓవైపు రోజువారీ వచ్చే చెత్తను వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ లకు తరలించడంతో పాటు ఈ – వేస్ట్ ను కూడా రీసైకిల్ చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు...సింగపూర్ లో అనుసరిస్తున్న విధానాలను ఏపీలో కొన్నిచోట్ల అమలుచేస్తే ఎలా ఉంటుందనే దానిపై సింగపూర్ అధికారులతో మంత్రి నారాయణ చర్చించారు.

శుక్రవారం మధ్యాహ్నం సింగపూర్ పోలీస్ ఫోర్స్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు మంత్రి నారాయణ.సింగపూర్ లో చట్టాల అమలు,శాంతి భద్రతల పరిరక్షణ వంటి అంశాలతో పాటు నేరాలను అరికట్టేందుకు ఉపయోగిస్తున్న సాంకేతిక గురించి అక్కడి పోలీస్ ఉన్నతాధికారులు మంత్రి నారాయణకు వివరించారు.ఆ తర్వాత సింగపూర్ కాలమానం ప్రకారం రాత్రికి అక్కడి నుంచి మలేషియా బయలుదేరి వెళ్లారు మంత్రి నారాయణ.మలేషియాలోనూ అర్బన్ డెవలప్ మెంట్,ట్విన్స్ టవర్స్ తో పాటు కన్వెన్షన్ సెంటర్లు,రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ వంటి అంశాలపై అక్కడి అధికారులతో కలిసి పరిశీలించనున్నారు.

మగ్గాలున్న చేనేతలకు ఉచిత విద్యుత్

కొత్తగా 1.09 లక్షల స్పౌజ్ పింఛన్లకు రూ.520 కోట్లు

త్వరలో కడప స్టీల్ ప్లాంట్ పనులు చేపడతాం...

2029 నాటికి ఉత్పత్తి ప్రారంభిస్తాం

ఘరానా మోసగాడు జగన్

జమ్మలమడుగు ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు



# చేనేతకు చేయూత

**జమ్మలమడుగు(జర్నలిస్ట్ ఫైల్) :** చేనేతలకు చేయూతనిచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. మగ్గాలున్న చేనేతలకు ఉచిత విద్యుత్ పథకం అమలు నిర్ణయాన్ని వెల్లడించారు. శుక్రవారం కడప జిల్లా జమ్మలమడుగులో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమంలో సీఎం ఈ ప్రకటన చేశారు. పవర్ లూమ్స్ ఉన్నవారికి 500 యూనిట్లు, హ్యాండ్ లూమ్ ఉన్నవారికి 200 యూనిట్ల మేర విద్యుత్‌ను ఉచితంగా అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈనెల 7వ తేదీన అంతర్జాతీయ చేనేత దినోత్సవం రోజు నుంచి ఈ పథకం అమల్లోకి రానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించడంతో పాటు పెట్టుబడుల కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తన సింగపూర్ పర్యటన విశేషాలను చెప్పారు. ఇదే సమయంలో వైసీపీ విధానాలను ఎండగట్టారు. చంద్రబాబు మాట్లాడుతూ... "రాష్ట్రానికి పెట్టుబడులు తెచ్చేందుకు, రాష్ట్ర బ్రాండ్ పెంచేందుకు సింగపూర్ వెళ్లొచ్చాను. మిగతా 2లో...



## గండికోట అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

డిసెంబరు 26,27 తేదీల్లో గండికోట ఉత్సవాలు

సాస్కి పథకం కింద గండికోట పర్యాటక ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సీఎం

గండికోటలో ఏపీ టూరిజం ఇన్వెస్టర్స్ మీట్ కు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు

3 లో

## జగన్ కు మతిభ్రమించింది



**శ్రీకాకుళం(జర్నలిస్ట్ ఫైల్) :** ఐదేళ్లు రాష్ట్రాన్ని పరిపాలించడం చేతకాక, ఆర్థిక వ్యవస్థను నాశనం చేసి, ఆనాటి ప్రతిపక్ష పార్టీ నేతలను, సామాన్య ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేసి, 2024 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ పార్టీ ఘోరంగా ఓటమి చెందటం వలన ఆ పార్టీ అధినేత జగన్ రెడ్డికి మతి భ్రమించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో రాష్ట్ర ప్రజలకు అందిస్తూ ఉంటుంటే అది చూసి ఓర్వలేక, సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రానికి పెట్టుబడులు వస్తుంటే జీర్ణించుకోలేక ప్రజా ప్రభుత్వంపై జగన్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడని మంత్రి అచ్చెన్న మండిపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆస్తులను లూటీ చేసి, వేల కోట్లు దోచుకున్న జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు తన అసలైన రూపాన్ని మరోసారి బయటపెట్టారని అన్నారు. రాష్ట్ర మంత్రుల ఇళ్లపై దాడులు చేయండి అనే పిలుపు ఇచ్చిన జగన్ హత్యా రాజకీయాలకే ప్రాతినిధ్యం వహిస్తున్నాడని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు.

వైఎస్ఆర్ కాంగ్రెస్ హయాంలో జరిగిన విపరీతమైన అవినీతిని ప్రజలు మర్చిపోలేరని, ప్రభుత్వ శాఖలన్నింటినీ తన దొంగ రాజకీయాలకు వాడుకున్న జగన్ రెడ్డి ఇప్పుడు ప్రతీకారం తీర్చుకునే దిశగా రాజకీయ అరాచకాన్ని ప్రోత్సహిస్తున్నాడని దుయ్యబట్టారు. సంక్షేమ పథకాలను వెనక్కి తొక్కి, రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచి, ఉద్యోగాలు, అభివృద్ధిని మట్టికరిపించిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఇప్పటికీ గుర్తుండిపోయే దాడుల రాజకీయాలను జగన్ రెడ్డి ప్రోత్సహించాడని, అందుకే ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసారని అన్నారు. గతంలో విశాఖ స్టీల్ ఫ్యాక్టరీను కాపాడిన కార్యకర్తలపై దాడులు చేయించి, హిందూపురం, మంగళగిరి, భీమవరం తదితర చోట్ల ప్రతిపక్ష నాయకుల ఇళ్లపై దాడులు చేయించిన గుండా జగన్ రెడ్డి అని మండిపడ్డారు. మీడియా, సోషల్ మీడియా వేదికల్లో ప్రజల స్వేచ్ఛను అణచివేతకు గురిచేసిన సంగతి ప్రతిఒక్కరికి గుర్తు ఉన్నాయని, ఇప్పుడూ అదే ముద్రతో తిరిగి దాడుల రాజకీయాన్ని తెరపైకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యానికి తీవ్ర ముప్పు అని అచ్చెన్నాయుడు హెచ్చరించారు. మిగతా 2లో...

## కొత్త బార్ పాలసీపై కసరత్తు

- మంత్రుల బృందం కీలక భేటీ
- ఆగస్టు 31తో ముగియనున్న ప్రస్తుత పాలసీ గడువు

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రస్తుత బార్ పాలసీ గడువు ఈ నెల 31తో ముగియనున్న నేపథ్యంలో, నూతన ఎక్సైజ్ విధానంపై మంత్రుల బృందం శుక్రవారం ఒక కీలక సమావేశం నిర్వహించింది. మంగళగిరి ఎక్సైజ్ కమీషనర్ కార్యాలయం నుంచి హైబ్రిడ్ మోడ్‌లో జరిగిన ఈ సమావేశంలో రాబోయే కొత్త బార్ పాలసీ రూపకల్పన పై లోతైన చర్చ జరిగింది. సమావేశానికి ఎక్సైజ్, ఖనిజ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యక్షంగా హాజరయ్యారు. ఆహారం, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, సెర్ప్ మరియు ఎన్ఆర్ఐ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు. మిగతా 2లో...



ఈ నెల 7 నుంచి ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం

మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్లు ఉచితం

ఏటా రూ.125 కోట్ల వ్యయం

65 వేల చేనేత కుటుంబాలకు లబ్ధి

ఉచిత విద్యుత్ పథకం అమలుపై మంత్రి సవిత హర్షం



# నేతన్నలకు చంద్రన్న గుడ్ న్యూస్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చేనేతలకు గుడ్ న్యూస్ చెప్పింది. నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం కింద మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల అందజేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. ఈ పథకం ఈ నెల ఏడో తేదీన జాతీయ చేనేత దినోత్సవం రోజు నుంచి వర్తింపజేయాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం అమలుతో మరో ఎన్నికల హామీని సీఎం చంద్రబాబు అమలుచేసినట్లయింది. 2019–24 మధ్య అయిదేళ్ల పాటు ఆనాటి ప్రభుత్వ సహాయ నిరాకరణ వల్ల చేనేత కార్మికులు అన్ని విధాలా నష్టపోయారు. ఇదే విషయం గుర్తించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్... చేనేత కార్మికులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మిగతా 2లో...

# చేనేతకు చేయూత



(మొదటి పేజీ తరువాయి)

నేను ఎక్కడ ఉన్నా ఒకటో తేదీన పేదల సేవలో పాల్గొనేలా చూసుకుంటున్నాను. అవసరమైతే నా కార్యక్రమాలు వాయిదా వేసుకుంటాను. ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఏదో మొక్కుబడిగా కాకుండా ఒక బాధ్యతగా చేస్తున్నాం. రాష్ట్రంలో 64 లక్షల మందికి రూ. 33 వేలకోట్లు వెచ్చిస్తున్నాం. దేశవ్యాప్తంగా పెన్షన్ల కోసం ఇంతపెద్ద మొత్తంలో ఖర్చు చేసేది ఏపీనే. మన రాష్ట్రం తర్వాత తెలంగాణ రూ. 8,170 కోట్లు, కేరళ రూ. 7,295 కోట్లు, హర్యానా రూ. 7,194 కోట్లు, వెస్ట్ బెంగాల్, 5,460 కోట్లు, రాజస్థాన్, రూ. 5,160 కోట్లు పింఛన్ల కోసం ఖర్చు చేస్తున్నారు. 1,08,499 మందికి కొత్తగా వితంతు పెన్షన్లు ఇచ్చేందుకు రూ. 43.40 కోట్లు విడుదల చేశాం. రెండు నెలల పాటు పింఛన్లు తీసుకోకపోయినా మూడు నెలలో కలిపి ఒకేసారి ఇస్తున్నాం. ఆస్పత్రుల్లో ఉన్న 14,703 మందికి, వృద్ధాశ్రమాల్లో ఉన్న 20,587 మందికి, ఒక సచివాలయ పరిధి నుంచి మరో సచివాలయ పరిధికి వెళ్లిన 31,496 మందికి, హాస్టళ్లలో ఉంటున్న దివ్యాంగ విద్యార్థులకు 3,683 మందికి ఇస్తున్నాం. ఇవి కాకుండా ఈ నెల నుంచి కొత్తగా 1.09 లక్షల మందికి స్పౌజ్ ఫించన్లు అందిస్తున్నాం. దీనికోసం రూ. 520 కోట్లు ఖర్చు పెడుతున్నాం' అని సీఎం వివరించారు.

**చెడగొట్టడం తేలిక..నిలబెట్టడమే కష్టం :** 'దేన్నైనా చెడగొట్టడం, పడగొట్టడం చాలా తేలిక... నిలబెట్టడమే చాలా కష్టం. విధ్వంసం చేయడం నిమిషం పని. గత ఐదేళ్లు అదే జరిగింది. కేంద్రం ప్రాయోజిత పథకాలు నిలిపేశారు. రూ. 10 లక్షల కోట్ల అప్పులు చేశారు. మే నెలలో జరిగిన మహానాడు వేదికగా కడప స్టీల్ ప్లాంట్ పనులు మొదలు పెడతామని చెప్పాం. స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు జిందాల్ సంస్థ ముందుకొచ్చింది. రూ. 4,500 కోట్లతో తొలి దశ, రూ. 11,850 కోట్లతో రెండో దశ పనులు చేపడుతుంది. 2029 కల్లా ఉత్పత్తి ప్రారంభిస్తుంది. ఈ ప్రాజెక్టు వస్తే జమ్మలమడుగుతో పాటు పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. గండికోటను పర్యాటకంగా అభివృద్ధి చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాం. సాస్కి పథకం కింద రూ. 80 కోట్లతో కేంద్ర పర్యాటకశాఖ పనులు చేపడుతోంది. అందమైన లోయలున్న గండికోటను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతాం. 100 అడుగుల ఎత్తులో శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం ఏర్పాటు చేస్తాం. ఓవైపు గండికోట, మరోవైపు ఒంటిమిట్ట మధ్యలో కడప దుర్గా... ఈ మూడింటిని అనుసంధానం చేస్తే పర్యాటకంగా సీమ అభివృద్ధి చెందుతుంది' అని సీఎం వివరించారు.



**నాలుగు ఉమ్మడి జిల్లాలకు సాగునీరు :** 'రాయలసీమను రతనాల సీమగా మారుస్తామని చెప్పిన మాటను నిలబెట్టుకుంటున్నాం. నాడు హంద్రీనీవా, గాలేరి నగరి, తెలుగుగంగ ప్రాజెక్టులకు ఎన్టీఆర్ శ్రీకారం చుట్టారు. తెలుగుగంగ ద్వారా సీమకు నీళ్లిచ్చాకే చెన్నైకి వెళతాయని చెప్పిన మహనీయుడు ఎన్టీఆర్. హంద్రీనీవా పనులు శరవేగంగా పూర్తి చేస్తున్నాం. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు, 33 లక్షల మందికి తాగునీరు అందించే ఈ ప్రాజెక్టుకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చాం. హంద్రీనీవా ప్రాజెక్టుకు ఒక్క ఏడాదినే రూ. 3,890 కోట్లు ఖర్చు చేశాం. జూలైలోనే మల్యాల ఎత్తిపోతల నుంచి సీమ జిల్లాలకు నీరు విడుదల చేశాం. ఫేజ్ 2 పనులు త్వరలో పూర్తిచేసి కడప జిల్లాలో 37,500 ఎకరాలకు సాగునీరు అందిస్తాం. గండికోట ప్రాజెక్టు ఎన్టీఆర్ ప్రారంభిస్తే నేను పూర్తి చేశాను.' అని ముఖ్యమంత్రి అన్నారు.

**జగన్ ఘరానా మోసగాడు :** 'వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఘరానా మోసగాడు. సొంత పత్రిక, టీవీని అడ్డంపెట్టుకుని తప్పుడు ప్రచారాలతో ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. సాక్షి మీడియాను అనుసరిస్తే కుక్కతోక పట్టుకుని గోదారి ఈదినట్టే. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడిన మందలించాల్సిందిపోయి... ఇంకా నోటికొచ్చినట్టు మాట్లాడాలని ప్రోత్సహించడాన్ని ఏమనాలి.? పార్టీ అధినేతగా ఉన్న వ్యక్తి తన పార్టీకి చెందిన నేతలు, కార్యకర్తలను క్రమశిక్షణలో ఉంచాలి. వైసీపీ వాళ్లు దుష్ప్రచారం చేస్తుంటారు. ఆనాడు వివేకానందరెడ్డికి గుండెపోటు అని సాక్షిలో వేశారు. తర్వాత గొడ్డలిపోటు అని తేలింది. నా చేతిలో కత్తిపెట్టి నేను చంపించానని రాశారు. బంగారుపాళ్యం పర్యటన దృశ్యాలను నెల్లూరు పర్యటన దృశ్యాలతో కలిపి భారీగా జనం వచ్చినట్లు చూపించారు. జిమ్మిక్కులతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారు. ప్రజలను మభ్య పెట్టి, మోసం చేసి అసౌర్యం కలిగిస్తామంటే చూస్తూ ఊరుకోం' అని సీఎం చంద్రబాబు హెచ్చరించారు.

**సీమ పారిశ్రామికాభివృద్ధికి రోడ్ మ్యాప్ :** 'పారిశ్రామికంగా సీమ అభివృద్ధి కోసం పూర్తిస్థాయి రోడ్ మ్యాప్ తయారుచేశాం. సాగుకు ప్రాధాన్యం ఇస్తూనే పరిశ్రమల రంగాన్ని బలోపేతం చేస్తున్నాం. ఆటోమొబైల్, స్పేస్, డిఫెన్స్, ఏరోస్పేస్, డ్రోన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను ఈ ప్రాంతంలో నెలకొల్పేలా అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఓర్వకల్లు-లేపాక్షి మధ్య ఎలక్ట్రానిక్, డిఫెన్స్, ఏరో స్పేస్ పరిశ్రమలను తెస్తాం. కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్‌ల కోసం రూ. 5,000 కోట్లు ఖర్చు చేస్తున్నాం. కర్నూలు, ఓర్వకల్లులో డ్రోన్ సిటీ వస్తే దేశానికి కావాల్సిన డ్రోన్స్ అన్నీ ఇక్కడే తయారవుతాయి. ఆర్ అండ్ బీ రోడ్లన్నీ బాగుచేస్తాం. కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ మాత్రమే కాకుండా రూ. 43,604 కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. గ్రీన్ ఎనర్జీలో రూ. 44 వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వం రూ. 12,441 కోట్లకు పైగా ఖర్చు చేయగా గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం రూ. 2 వేల కోట్లు మాత్రమే ఖర్చు పెట్టింది. అవుకు, జీడిపల్లి, మారాల, చెర్లోపల్లి, గండికోట, బ్రహ్మంసాగర్, మైలవరం ప్రాజెక్టులు పూర్తి చేసింది టీడీపీనే. సముద్రంలోకి పోయే నీటిని మనం వాడుకుంటే ఏపీ, తెలంగాణలో కరువు ఉండదు. అదృష్టవశాత్తు రాష్ట్రంలో రిజర్వాయర్లు ఉన్నాయి. వాటిలో నీరు నిల్వ పెట్టుకుంటే సాగుకు ఇబ్బంది ఉండదు. సీమను హార్టికల్చర్ హబ్ గా తయారుచేసే కార్యక్రమానికి టీడీపీనే శ్రీకారం చుట్టింది. దీని వల్ల రైతుల ఆదాయం పెరుగుతోంది' అని సీఎం తెలిపారు.

**రేపే అన్నదాత సుఖీభవ :** '2024 ఎన్నికల్లో ప్రజలు అద్భుత విజయం అందించారు. సుపరిపాలనలో తొలిఅడుగు వేశాం. కేంద్ర సాయంతో కలిపి ఒక్కోరైతుకు ఏడాదికి రూ. 20 వేలు ఇస్తామని చెప్పాం. చెప్పినట్టే రేపు అన్నదాత సుఖీభవ కింద రైతులందరికీ డబ్బు జమ చేస్తాం. కేంద్రం ఇచ్చే రూ. 2 వేలతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఒక్కో రైతుకు రూ. 5 వేలు చొప్పున బ్యాంకు ఖాతాలో జమ చేస్తాం. గత ప్రభుత్వం రూ. 12,500 ఇస్తామని రూ. 7,500



ఇచ్చింది. మన ప్రభుత్వం దాన్ని రూ. 14,000 వేలకు పెంచింది. ఏది రైతు ప్రభుత్వమో, ఏది రైతు వ్యతిరేక ప్రభుత్వమో ప్రజలే నిర్ణయించుకోవాలి. అలాగే 90 శాతం సబ్సీడీతో డ్రిప్ ఇరిగేషన్ ఇస్తే గత ఐదేళ్లలో దాన్ని నిలిపేశారు. ఈనెల 15వ తేదీ నుంచి ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం' అని సీఎం ప్రకటించారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో 12 చెరువులకు లిఫ్ట్ ఇరిగేషన్ కోసం రూ. 30 కోట్లు విడుదల చేస్తాం. జమ్మలమడుగు, ఎర్రగుంట్ల మున్సిపాలిటీల అభివృద్ధికి రూ. 30 కోట్లు మంజూరు చేస్తాం. గండికోట రిజర్వాయర్ ముంపు బాధితులను ఆదుకుంటాం' అని భరోసా ఇచ్చారు.

**లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లిన సీఎం :** జమ్మలమడుగు మండలం, గూడెంచెరువు గ్రామంలో పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సీఎం ప్రజావేదిక కార్యక్రమానికి హాజరయ్యే ముందు పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. ఉల్సాల అలివేలమ్మ అనే లబ్ధిదారు ఇంటికెళ్లి వితంతు పెన్షన్ అందించారు. కాసేపు వారితో ముచ్చటించారు. అలివేలమ్మ ఇంట్లో ఉన్న చేనేత మగ్గాన్ని పరిశీలించారు. ఆమెకు పింఛను అందజేసి ఇంటినుంచి బయటకు వస్తున్న సమయంలో పక్షవాతంతో బాధపడుతున్న వెలిగండ్ల మునీంద్ర తనకు పింఛను మంజూరు చేయాలని అభ్యర్థించారు. అతని పరిస్థితిని చూసిన సీఎం చంద్రబాబు తక్షణమే మునీంద్రకు పింఛను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం అక్కడి నుంచి ఆటోడ్రైవర్ జగదీష్ ఆటోలో ప్రజావేదికకు చేరుకున్నారు.



## నేతన్నలకు చంద్రన్న గుడ్ న్యూస్



(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, చేనేతలకు లబ్ధి కలిగేలా ఎన్నో నిర్ణయాలు తీసుకున్నారు. నేత్నలకు 365 రోజుల పాటు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో రూ. 10 వేల కోట్లతో నూతన టెక్స్ టైల్స్ పాలసీ తీసుకొచ్చారు. ఈ పాలసీ ద్వారా 1.51 లక్షల మందికి ఉపాధి కల్పించాలని నిర్ణయించారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల కింద 92,724 మంది నేతన్నలకు రూ. 3 వేల నుంచి రూ. 4 వేలకు పెన్షన్ మొత్తం పెంచారు. మొదటి ఏడాది పెన్షన్ల రూపంలోనే రూ. 370.89 కోట్లు లబ్ధిదారులకు చెల్లించారు. చేనేతలకు త్రిఫ్ట్ పథకం కింద 2024-25లో రూ. 5 కోట్లు, 2025-26లోనూ త్రిఫ్ట్ పథకానికి మరో రూ. 5 కోట్లు కేటాయించారు. క్యాష్ క్రెడిట్ కార్డులతో సహకార సంఘాలకు బ్యాంకు రుణాలు అందజేస్తున్నారు. నేటితరం అభిరుచులకు అనుగుణంగా నూతన వస్త్రాల తయారీలో అయిదు జిల్లాల్లో నేతన్నలకు నైపుణ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. చేనేత వస్త్రాల విక్రయాలకు రాష్ట్రంతో పాటు దేశంలోని ఏడు నగరాల్లో ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశారు. ఆప్కో నేతృత్వంలో ఈ కామర్స్ ద్వారా నేరుగా వినియోగదారుల ఇళ్ల వద్దకే చేనేత వస్త్రాలను డెలివరీ చేస్తున్నారు. జాతీయ హ్యాండ్‌లూమ్ అభివృద్ధి ప్రోగ్రామ్ కింద 2024-25లో 10 క్లస్టర్లు ఏర్పాటు చేశారు. వీవర్స్ ముద్రా స్కీమ్ ద్వారా చేనేతలకు రుణాలు అందజేశారు. ముడి పదార్థాల సరఫరా పథకం నూలుపై 15 శాతం సబ్సిడీ అందజేస్తున్నారు. విశాఖపట్నంలో రూ. 172 కోట్లు యూనిటీ మాల్ నిర్మిస్తున్నారు. రాయదుర్గం, హిందూపురం, బ్రాండెక్స్ టెక్స్ టైల్స్ పార్కుల అభివృద్ధితో పాటు ఎమ్మిగనూరు టెక్స్ టైల్స్ పార్క్ కూడా నిర్మించబోతున్నారు. చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడానికి టాటా తనేరియా, ఆద్యం బిర్లా గ్రూప్, తమిళనాడుకు చెందిన కో ఆప్టెక్స్ తోనూ ఒప్పందం చేసుకున్నారు. స్వయం సహాయక సంఘాల్లో ఉన్న చేనేత మహిళలకు రూ. 10 వేలు విలువ చేసే నూలును అందజేస్తున్నారు. మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో రాష్ట్ర వ్యాప్తంగా వీవర్ శాలల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.

**ఏటా రూ.125 కోట్ల వ్యయం... :** చేనేతల ఆర్థిక వృద్ధికి మరో కీలక పథకం ఉచిత విద్యుత్ పథకానికి సీఎం చంద్రబాబునాయుడు పచ్చజెండా ఊపారు. రాష్ట్రంలో మగ్గాల మీద 50 వేల నేతన్నలు, మర మగ్గాలపై 11,500ల మంది ఆదారపడి జీవిస్తున్నారు. వారందరికీ ఉచిత విద్యుత్ పథకం వర్తింపజేసేలా కీలక నిర్ణయం తీసుకున్నారు. మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500ల ఉచితంగా అందజేయనున్నారు. ఇందుకోసం ప్రభుత్వంపై ఏటా రూ. 125 కోట్ల మేర భారం పడనుంది.

**నేతన్నలకు జాతీయ చేనేత దినోత్సవ గిఫ్ట్ :** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నేతన్నలకు కూటమి ప్రభుత్వం గిఫ్ట్ అందజేసింది. ఉచిత విద్యుత్ పథకం అమలు తీరుతెన్నులపై పెన్షన్ల పండగ నిమిత్తం కడప పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబుతో రాష్ట్ర చేనేత, జౌళి శాఖామంత్రి సవిత చర్చించారు. ఈ నెల ఏడో తేదీ నుంచి ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం చుట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

**మంత్రి సవిత హర్షం:** నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకం వర్తింప జేయడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేస్తూ, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఉచిత విద్యుత్ పథకం వల్ల చేనేత కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో మేలు కలుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేనేతలకు మేలు కలిగేలా కీలక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. నేతన్నలకు 365 రోజుల పాటు పని కల్పించడంతో పాటు వారి కుటుంబాలు గౌరవ ప్రదమైన జీవనం సాగించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ప్రణాళికలు అమలు చేస్తున్నారన్నారు. చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కలిగించేలా పలు ఒప్పందాలు చేసుకున్నారన్నామన్నారు. త్వరలోనే చేనేత సహకార సంఘాల ఎన్నికలకు నోటిఫికేష్ విడుదల చేస్తామని మంత్రి సవిత వెల్లడించారు.

## కొత్త బార్ పాలసీపై కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ఎక్సైజ్ డైరెక్టర్ నిషాంత్ కుమార్ ప్రస్తుతం అమలులో ఉన్న 2022-25 బార్ పాలసీపై సమగ్రంగా వివరించారు. ప్రస్తుత పాలసీ క్రింద రాష్ట్రంలో 840 స్టాండలోన్ బార్లు, 50 స్టార్ హోటల్స్, మైక్రోబ్రూరీస్ లాంటి సంస్థలకు లైసెన్సులు మంజూరయ్యాయని చెప్పారు. అలాగే 44 బార్ లైసెన్సులు గడువు ముగిసిన తర్వాత రిన్యువల్ కాలేదని తెలియజేశారు. పక్కటి రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ మరియు కేరళల బార్ విధానాలపై పోలికలు కూడా ఈ సమావేశంలో చర్చకు వచ్చాయి.

సాధారణ పరిపాలన (రాజకీయం), ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా వివిధ సంఘాల నుంచి వచ్చిన అభిప్రాయాలను మంత్రులకు వివరించారు. రాష్ట్ర వైన్ డీలర్లు, స్టార్ హోటల్‌ల అసోసియేషన్‌లు, హోటల్ యజమానుల సమాఖ్యల నుండి వచ్చిన వినతులను సమావేశం దృష్టికి తీసుకుని వచ్చారు. గతంలో పాటించిన బార్ లైసెన్సింగ్ విధానాలు, వాటి ప్రభావం, కొత్త విధానాల్లో ఆర్థిక ప్రయోజనాలు ఎలా ఉండబోతున్నాయన్నదాని గురించి వివరించారు. మంత్రులు తమ సూచనలు, ఆలోచనలు ప్రస్తావించారు. ప్రస్తుత షాపు పాలసీ అమలుపై సమాచారం కోరడంతో పాటు, టూరిజం శాఖతో సమన్వయం కల్పించి, పర్యాటక అభివృద్ధికి అనుకూలంగా పాలసీ రూపొందించాలని సూచనలు వచ్చాయి. కొత్త పారిశ్రామిక కారిడార్లలో బార్లకు చేయాల్సిన మార్పులు కూడా చర్చకు వచ్చాయి. యువ



పారిశ్రామికవేత్తలు కొత్తగా రంగంలోకి రావడాన్ని ప్రోత్సహించే విధానాలు తీసుకురావాలని అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

ఈ సూచనల ఆధారంగా బార్ పాలసీకి తుది రూపం ఇవ్వడానికి ఎక్సైజ్ శాఖ మరింతగా ఆలోచించి, పాలసీ రూపకల్పనను ముందుకు తీసుకెళ్తుందని ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. తదుపరి సమావేశంలో నూతన విధానాన్ని సమీక్షించి, తుది నిర్ణయం తీసుకోవలసి ఉందన్నారు. ఈ సమావేశానికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మ, అదనపు కమిషనర్ దేవకుమార్, జాయింట్ కమిషనర్లు, ఇతర అధికారులు హాజరయ్యారు.

## పండగ వాతావరణంలో.. పింఛన్ల పంపిణీ

**కోటబొమ్మాళి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో గత ప్రభుత్వం దుర్మార్గమైన పాలన కారణంగా అన్ని వ్యవస్థలు నీర్వీర్యం అయ్యాయని, ఐదేళ్ల పాటు రాష్ట్రంలో ఒక్క అభివృద్ధి కూడా జరగలేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం తులసిపేట గ్రామంలో శుక్రవారం ఎన్టీఆర్ భరోసా ఫింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ఇంటి ఇంటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. రూ. 35 నుంచి ప్రారంభమైన పింఛను నేడు రూ. 4 వేలు ఇస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదని, ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు అమలు చేస్తున్నామని తెలిపారు. 64 లక్షల మందికి రూ. 34 వేల కోట్ల రూపాయలను పింఛన్ల కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం 1.20 లక్షల మందికి వితంతు పంఛన్లను తొలగించిందని, వాటిని నేడు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పునరుద్ధరించామని తెలిపారు. వివిధ కారణాల కారణంగా కొన్ని తిరస్కరణ అయ్యాయని, వాటిని పరిశీలించి అర్హత ఉన్నవారికి మంజూరు చేయడం జరుగుతందని హామీ ఇచ్చారు. ఒక్కరోజే 1.09 లక్షల మందికి పింఛన్లు పంపిణీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదని,



సంక్షేమ పథకాలతో దుసుకుపోతున్న కూటమి ప్రభుత్వం మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నామని ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్రంలో 47 లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరేలా రూ. 3,156 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం రూ. 5వేలు, కేంద్ర ప్రభుత్వం 2,000, మొత్తం 7,000 డైరెక్ట్ గా రైతుల ఖాతాలోకి వేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నామని, తల్లికి వందనం పథకం కింద అర్హత ఉన్న వారికి ఎంత మంది ఉంటే అంత మందికి మొత్తం రూ. 8,700 కోట్ల రూపాయాలు జమ చేయడం జరిగిందని అన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమాంతరంగా తీసుకు వెలుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, ఆర్డిఓ ఎం. కృష్ణమూర్తి, ఎమ్మార్వో ఆర్. అప్పలరాజు, ఎంపీడీవో ఫణీంద్ర కుమార్, గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

వైకాపా నాయకులు ఆలీబాబా 40 దొంగలు ప్రజలను మోసం చేసేందుకు గ్రామాల్లో తిరుగుతున్నారు.. ప్రజలు వారిని నిలదీయండి

వైకాపా నాయకులు బాబు షూరిటీ మోసం గ్యరంటీ అంటూ గ్రామాల్లో తిరుగుతున్నారని, అసత్య ప్రసారాలు చేస్తూ ఆలీబాబా 40 దొంగల్లా పర్యటనలు చేస్తున్న వారిని ప్రజలు నిలదీయాలని సూచించారు. గత ఐదేళ్ల పాటు అభివృద్ధి పనులను చేయని వారికి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు లేదన్నారు. రాష్ట్రంలో ఏడాదిలో చేసిన అభివృద్ధి వారి కంటికి కనిపించదా అని ప్రశ్నించారు. అన్న క్యాంటీన్లను రద్దు చేసిన జగన్ పేదల కడుపు కొట్టారని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు, రూ. 5 కే అన్నం పెడుతూ రాష్టంలో రోజుకు 2.5 లక్షల మందికిపైగా ఆకలి తీర్చుతున్నామని అన్నారు. రాష్ట్రంలో 3.5 లక్షల పింఛన్లు, 1.20 లక్షల వితంత పింఛన్లు తొలగించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వాటిని పునరుద్ధరించిందని, ఇవి వారి కంటికి కనిపించవా అని ప్రశ్నించారు. గ్రామాల్లో తట్టెడు మట్టితీసి ఒక్క అభివృద్ధి పనులు కూడా చేయని వారు నేడు అభివృద్ధి, సంక్షేమంపై మాట్లాడే అర్హత వారికి లేదని అన్నారు.

## కానిస్టేబుల్ పరీక్ష ఫలితాలు విడుదల

**మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో 6, 100 పోలీస్ కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి సంబంధించి ఫలితాలను డీజీపీ కార్యాలయంలో విడుదల చేయడం జరిగిందని హోంమంత్రి అనిత తెలిపారు. 168 మార్కులతో ప్రథమ స్థానంలో గండి నానాజీ, 159 మార్కులతో రెండవ స్థానంలో రమ్య మాధురి, మూడో స్థానంలో 144.5 మార్కులతో మెరుగు అచ్యుతరావు నిలిచారు. తుది ఫలితాల్లో అర్హత సాధించిన వారికి హోంమంత్రి అనిత అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఆర్.కే. మీనా పాల్గొన్నారు.




## జగన్‌కు మతిభ్రమించింది

(మొదటి పేజీ తరువాయి)



**అవినీతి పాలనకు మరో పేరు జగన్ రెడ్డి :** 2024లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు జగన్ రెడ్డికి, ఆయన పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారు. కూటమిని గెలిపించి, అభివృద్ధికి, సంక్షేమానికి ఓటు వేశారు. అయినా తన పరాజయాన్ని జీర్ణించుకోలేని జగన్, ఇప్పుడు అశాంతిని రెచ్చగొట్టే కుట్రలు చేస్తుండటం దురదృష్టకరం. జగన్మోహన్ రెడ్డి తన వ్యవహార శైలిని మార్చుకోకపోతే ప్రజలు ఓట్లు కాదు కదా కనీసం రోడ్లమీద కూడా తిరగనివ్వరని పరిస్థితి తలెత్తుతుందన్నారు. అవినీతి పరులను, దొంగలను, బెట్టింగ్ ఆడే వారిని, సంస్కారం లేని వ్యక్తులను వెనకేసుకొచ్చే జగన్మోహన్ రెడ్డికి ముఖ్యంత్రి చంద్రబాబును, కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదన్నారు. ఒక మహిళ శాసనసభ్యురాలని అసభ్యకరంగా మాట్లాడి, వ్యక్తిగతంగా దూషించిన ప్రసన్నకుమార్ రెడ్డిని, అవినీతి చేసి జైలు లో ఉన్న కాకాణి గోవర్ధన్ రెడ్డిని పరామర్శించడానికి జగన్మోహన్ రెడ్డి రావడం విడ్డూరంగా ఉందన్నారు. తన కారు కింద పడి మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించలేని జగన్మోహన్ రెడ్డి అరెస్ట్ అయిన గంజాయి ముఠా నాయకులను, రౌడీ షీటర్ లను,మదమెక్కి స్త్రీలను అగౌరవంగా మాట్లాడుతున్న సంస్కారం లేని నాయకులను పరామర్శించడం ఏంటని ప్రశ్నించారు. టీ దుకాణాలు మొదలు మల్టీ నేషనల్ కంపెనీల నుంచి వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు కలెక్షన్లు వసూలు చేశారని ఇవ్వని కంపెనీలను బెదిరించి రాష్ట్రం వదిలి వెళ్ళే విధంగా చేశారని వారి అవినీతిలో జగన్మోహన్ రెడ్డికి కూడా వాటా వెళ్లిందని ఆరోపించారు.

**శాంతి, భద్రతలకు కట్టుబడి ఉన్నాం :** కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అంకితంగా పని చేస్తోంది. పింఛన్ల పెంపు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్స్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, డ్రోన్ సాయంతో సాగు, విద్యుత్ సరఫరా వంటి మంచి పథకాలను అమలు చేసి, అభివృద్ధి దిశగా ముందుకెళ్తున్న రాష్ట్రంలో అశాంతికి తావు లేదని, శాంతిని భంగం చేయాలనుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ప్రజలు మమ్మల్ని ఆదరించిన నమ్మకాన్ని వమ్ము చేసుకోకుండా శాంతి, అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పని చేస్తామని, నకిలీ పోరాటాల వెనక దాగి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు వృథా అవుతాయని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమాన్ని చూసి ఓర్వలేక బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్మోహన్ రెడ్డి తో పాటు ఆ పార్టీ నాయకులకు కూడా తన వ్యవహార శైలిని మార్చుకోకుండా తాము మళ్లీ అధికారంలోకి వస్తే ఎవరిని వదలం, కేసులు పెడతామంటూ బెదిరించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని వారికి ఓట్లు వేసే పరిస్థితి ఉండకపోగా రోడ్ల పైన కూడా తిరగనివ్వరని హెచ్చరించారు.

**రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా అడుగులు :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ లు అహర్నిశలు ప్రజా సంక్షేమాన్ని రాష్ట్ర అభివృద్ధిని కోరుకుంటూ దేశ విదేశాలు తిరుగుతూ పెట్టుబడులను తీసుకువస్తున్నారని కొనియాడారు. సింగపూర్ పర్యటన వలన కూడా రాష్ట్రానికి 45 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడి రానున్నాయని ఇలాంటి ప్రయత్నం గత ప్రభుత్వంలో జరిగిందా అని జగన్ రెడ్డిని ప్రశ్నించారు. ప్రజల సంక్షేమం, పల్లె ప్రగతి, పారిశ్రామిక వికాసమే కూటమి ప్రభుత్వ ధ్యేయం. పేదలకు అండగా, యువతకు అవకాశాలుగా, రైతులకు మద్దతుగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రతి నిర్ణయం, ప్రతి ఆర్థిక కేటాయింపు కూడా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దోహదం చేసేలా తీసుకుంటున్నామని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రివర్గం, ప్రజాప్రతినిధులు అందరూ కూడా సమిష్టిగా ఒకే దిశగా ముందుకు సాగుతున్నారు. ఎన్నికల హామీలను అమలు చేయడమే కాకుండా, మరిన్ని ప్రజల కొరకు కొత్త పథకాలు రూపొందిస్తూ అభివృద్ధి బాటలో రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం. రాష్ట్రంలో మహిళలు, యువతీ యువకులు, వ్యాపారవేత్తలు అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని అయితే జగన్మోహన్ రెడ్డి తన ఉనికి కోసం పరామర్శల పేరుతో తిరుగుతూ రాష్ట్రంలో అలజడి సృష్టించాలని ప్రయత్నిస్తున్నారని దుయ్యబట్టారు.

# లోకేష్ నాయకత్వం... నేటి ఆశ, రేపటి విజయగాథ !





(మొదటి పేజీ తరువాయి)

ఇదే సందర్భంలో ఆయన మంత్రి లోకేష్ నాయకత్వాన్ని ప్రశంసించారు. యువతకు భవిష్యత్ బాటలు వేయడంలో లోకేష్ చూపుతున్న శ్రద్ధ అపూర్వమన్నారు. "లోకేష్ ఓ విద్యావంతుడు, టెక్నాలజీతో ముడిపడి ఉన్న నాయకుడు. క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ రంగాల్లో పెట్టుబడులు, ఉద్యోగావకాశాల పెరుగుదల కోసం ఆయన నిరంతరం శ్రమిస్తున్నారు. ఆయన చూపుతున్న దూరదృష్టి రాష్ట్ర అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తోంది" అని అభిప్రాయపడ్డారు.

రైతుల సంక్షేమంపై కూడా ఎమ్మెల్సీ విశేషంగా వివరించారు. "ముందుగా హామీ ఇచ్చినట్లే, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం ఆగస్టు 2నుంచి అన్నదాత సుఖీభవ కింద ఒక్కో రైతుకు రూ.7,000 (కేంద్రం ఇచ్చే రూ.2,000తో కలిపి రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.5,000) జమ చేయబోతోంది. గత ప్రభుత్వ హామీతో పోలిస్తే ఇది నూటికి నూరు శాతం నెరవేర్చే చర్య. అలాగే డ్రిప్ ఇరిగేషన్‌కు 90 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం ఈ నెల 15వ తేదీ నుంచి అందుబాటులోకి రానుంది" అని తెలిపారు.

పింఛన్ల విషయాన్ని ప్రస్తావిస్తూ... "మన రాష్ట్రంలో ప్రతి నెలా 64 లక్షల మందికి రూ.33 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. దేశంలోని ఏ రాష్ట్రం ఇంత పెద్ద మొత్తాన్ని ఖర్చు చేయడం లేదు. కేరళ, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల కంటే ద్రవ్య వినియోగంలో ఏపీ ముందుంది. పింఛన్ పంపిణీని బాధ్యతగా చేపట్టి, కొత్తగా 1.08 లక్షల మందికి వితంతు పెన్షన్లు మంజూరు చేశాం. 1.09 లక్షల మందికి స్పౌజ్ పెన్షన్లు కూడా ప్రారంభించాం. ఇందుకోసం రూ.520 కోట్లు ఖర్చు పెడుతున్నారు" అని వివరించారు. "2024లో ప్రజలు ఇచ్చిన అద్భుతమైన విజయం కూటమికి భాద్యత పెంచింది. ఆ విశ్వాసానికి తగ్గట్టుగా పాలన సాగుతోంది. అభివృద్ధి, పారదర్శకత, సంక్షేమంలో మారుపేరుగా చంద్రబాబు నాయకత్వం నిలుస్తోంది" అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల ఆశయాల దిశగా తొలి అడుగు వేస్తున్న సుపరిపాలన కార్యక్రమం విజయవంతమవుతుందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ పర్యటనలో మండల పార్టీ అధ్యక్షుడు కేసన కోటేశ్వరరావు, మైనార్టీ నాయకుడు నశీమ్, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో కార్యక్రమానికి హాజరై ఎమ్మెల్సీని అభినందించారు. 'సుపరిపాలన – తొలి అడుగు' ప్రజల్లో విశ్వాసాన్ని నాటే ప్రజాహార్దయ కార్యక్రమంగా మారింది!









## జాతీయ చలన చిత్ర అవార్డులు..




(మొదటి పేజీ తరువాయి)

**జాతీయ చలన చిత్ర అవార్డులు ఫీచర్ ఫిల్మ్**

ఉత్తమ ఫీచర్ ఫిల్మ్: 12th ఫెయిల్

ఉత్తమ దర్శకత్వం: ది కేరళ స్టోరీ (హిందీ) సుదీప్తో సేన్

ఉత్తమ నటుడు: జవాన్ (హిందీ) షారుక్ ఖాన్, 12th ఫెయిల్ (హిందీ) విక్రాంత్ మస్సే

ఉత్తమ నటి: మిస్సెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే (హిందీ) రాణీ ముఖర్జీ

ఉత్తమ సహాయ నటుడు: పూక్కాలం (మలయాళం) విజయ రాఘవన్‌బీ పార్కింగ్ (తమిళ్) ముత్తుపెట్టాయ్ సోము భాస్కర్

ఉత్తమ సహాయ నటి: ఉళ్ళొలుక్కు (మలయాళం) ఊర్వశిబీ వష్ (గుజరాతీ) జానకీ బోడివాలా

బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్: గాంధీతాత చెట్టు (తెలుగు) సుకృతివేణిబీ జిప్సీ (మరాఠీ) కబీర్ ఖండారీబీ నాల్ 2 (మరాఠీ) త్రిష థోసర్, శ్రీనివాస్ పోకలే, భార్గవ్ జగ్దీప్

ఉత్తమ నేపథ్య గాయకుడు: బేబీ (ప్రేమిస్తున్నా..) పీవీఎన్ ఎస్ రోహిత్

ఉత్తమ నేపథ్య గాయని: జవాన్ (చెలియా) శిల్పారావు

ఉత్తమ సినిమాటోగ్రఫీ: ది కేరళ స్టోరీ (హిందీ) పసంతను మొహపాత్రో

ఉత్తమ సంభాషణలు: సిర్ఫ్ ఏక్ బందా కాఫీ హై (హిందీ) దీపక్ కింగ్రానీ

ఉత్తమ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): పార్కింగ్ (తమిళ్) రామ్‌కుమార్ బాలకృష్ణన్‌బీ బేబీ (తెలుగు) సాయి రాజేశ్ నీలం

ఉత్తమ సౌండ్ డిజైన్: యానిమల్ (హిందీ) సచిన్ సుధాకరన్, హరి హరన్ మురళీ ధరన్

ఉత్తమ ఎడిటింగ్: పూక్కాలమ్ (మలయాళం) మిధున్ మురళి

ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: 2018 (మలయాళం) మోహన్‌దాస్

ఉత్తమ నృత్య దర్శకత్వం: రాకీ ఔర్ రాణి కి ప్రేమ కహానీ (హిందీ) వైభవ్ మర్చంట్

ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: సామ్ బహదూర్ (హిందీ) సామ్ బహదూర్ (హిందీ) సచిన్ లవ్లేకర్, దివ్య గంభీర్, నిధి గంభీర్

## పెన్షన్లు పంపిణీ చేసిన మంత్రి, ఎమ్మెల్యే



**మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్):** మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రొద్దుటూరు రోడ్డులో మూలబాట నందు ఎన్టీఆర్ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఇన్చార్జి మంత్రి సవితమ్మ తో మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కలిసి వృద్ధులకు వితంతువులకు ఒంటరి మహిళలకు మరియు వికలాంగులకు పెన్షన్ పంపిణీ చేయడం జరిగింది.

## తల్లి పాల వారోత్సవాలు



**కాకుమాను,(జర్నలిస్ట్ ఫైల్):**అంతర్జాతీయ తల్లి పాల వారోత్సవాలు ను పురస్కరించుకొని ఐసీడీఎస్ కాకుమాను మండలం నందు కాకుమాను సెక్టార్ పరిదిలో ఆ గ్రామం నందు, పాంద్రపాడు సెక్టార్ పరిదిలో లింగంగుంట్ల గ్రామాలలో సూపర్ వైజర్ లు వెంకాయమ్మ,ప్రేమ లత ల ఆధ్వర్యంలో తల్లి పాల ఆవశ్యకత తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో భాగంగా తల్లి పాల వలన బిడ్డకు తల్లి కి లభించే ప్రయోజనాలు గురించి అవగాహన కల్పించారు. ప్రతి తల్లి తన బిడ్డకు తప్పనిసరిగా పాలు ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భముగా గ్రామంలో గల పలు గర్భిణీ స్త్రీల కుటుంబాలను సందర్శించి వారికి పలు ఆరోగ్య సలహాలు,సూచనలు అందించారు. ఈ కార్యక్రమం లో ఆయా గ్రామాల అంగన్వాడీ సిబ్బంది,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గండికోట అభివృద్ధికి మాస్టర్ ప్లాన్



**గండికోట(జర్నలిస్ట్ ఫైల్) :** పర్యాటకంగా గండికోట అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. శుక్రవారం గండికోట వద్ద ఆంధ్రప్రదేశ్ టూరిజం ఇన్వెస్టర్స్ మీట్ కు హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గండికోట ప్రాంతాన్ని యాంకర్ హబ్ గా అభివృద్ధి చేస్తున్నట్టు వివరించారు. ప్రకృతి వరప్రసాదంగా ఏర్పడిన గండికోట ప్రాంతం భారత్ గ్రాండ్ కాన్యన్ గా పేరొందిందని అన్నారు. దీంతో పాటు 13 శతాబ్దంలో కాకతీయులు నిర్మించి, ఆ తర్వాత విజయనగర రాజులు పాలించిన ఈ ప్రాంతం చారిత్రక సంపదకు ప్రతిరూపంగా ఉందని స్పష్టం చేశారు. గండికోట ప్రాంతాన్ని సాస్కీ కింద రూ.78 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు ఈ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అద్భుతమైన పర్యాటక కేంద్రంగా గండికోటను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు చేసిందని ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే పర్యాటకులు బస చేసేలా స్టార్ హోటళ్ల నిర్మాణం చేపడతామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పర్యాటక ప్రాంతాల్లో 50వేల హోటల్ గదుల నిర్మాణం చేసేలా కార్యాచరణ చేపట్టామని ముఖ్యమంత్రి వెల్లడించారు. టూరిస్టులను ఆకర్షించేలా గండికోట వద్ద వ్యూపాయింట్ తో పాటు, ఎకో ఫ్రెండ్లీ టెంట్ సిటీ, బోటింగ్ తో పాటు కోట వద్ద లైటింగ్ తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. ఈ ప్రాజెక్టు సందర్శించిన వారికి మంచి అనుభూతి కలిగేలా రోప్ వే, గ్లాస్ బాటమ్ వాక్ వే, లైట్ అండ్ సౌండ్ షోలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఏడాది చివరి కల్లా టెంట్ సిటీని కూడా ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గ్రాండ్ కాన్యన్ ను ఆకాశం నుంచి వీక్షించేందుకు హెలిరైడ్స్ కూడా సెప్టెంబరు నుంచి మొదలు అవుతాయన్నారు. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై తదితర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు కారావాన్ టూరిజం సర్వీసులు కూడా అందుబాటులోకి వస్తాయన్నారు.

**రూ.500 కోట్ల విలువైన పర్యాటక ప్రాజెక్టులకు ఒప్పందాలు :** రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో పర్యాటక ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించిన ఒప్పందాలు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి. ఈజ్ మై ట్రిప్, హిల్టన్ హోటల్స్ సహా వివిధ సంస్థలు ఏపీ టూరిజం కార్పోరేషన్ తో రూ.500 కోట్ల విలువైన ఒప్పందాలు చేసుకున్నాయి. గండికోటతో పాటు శ్రీశైలం, మంత్రాలయం, తిరుపతి తదితర ప్రాంతాల్లో హోటళ్ల నిర్మాణం, అడ్వెంచర్ స్పోర్ట్స్, హై రోప్, కయాకింగ్, జెట్ స్కీయింగ్ లాంటి ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు వీలుగా ఈ ఒప్పందాలు కుదిరాయి. కేంద్రప్రభుత్వ పథకాలైన సాస్కి, స్వదేశ్ దర్శన్ పథకాల కింద గండికొట, బొర్రా గుహలు, అహోబిలం, నాగార్జున సాగర్ ప్రాంతాల్లో వివిధ టూరిజం ప్రాజెక్టులను సీఎం వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. ఏపీలో అమలు చేస్తున్న టూరిజం పాలసీలో భాగంగా పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా కల్పిస్తున్నామని అపార మైన అవకాశాలను వినియోగిం చుకోవాలని ముఖ్యమంత్రి పెట్టుబడి దారులకు పిలుపుని చ్చారు. రాష్ట్రంలో ఎకో టూరి జం, అడ్వెంచర్, క్రూయిజ్, వెల్ నెస్, కారావాన్, గోల్ఫ్, హెరిటేజ్, టెంపుల్ టూరిజం ప్రాజెక్టులకు విస్తృతమైన అవకా శాలు ఉన్నాయని అన్నారు. విశాఖ, అరకు వ్యాలీ, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోటలను 7 యాంకర్ హబ్ లు గా తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. అలాగే 25 థీమాటిక్ సర్క్యూట్ లను కూడా ప్రకటించామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో హోమ్ స్టేలను కూడా ప్రోత్సహిస్తామని అన్నారు. రాష్ట్రస్థాయిలో 8 పర్యాటక ఈవెంట్లను నిర్వహించటంతో పాటు జిల్లాల వారీగానూ కార్యక్రమాలు, టూరిజం ఫెస్టివల్స్ నిర్వహిస్తామన్నారు. అంతకుముందు గండికోట గ్రాండ్ కాన్యన్ సందర్శించిన ముఖ్యమంత్రి అక్కడే ఉన్న టూరిస్ట్ గైడ్, పర్యాటకులతో కొద్దిసేపు మాట్లాడారు.

# సచివాలయంలో .. నో ప్లాస్టిక్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** వచ్చే ఏడాది జూన్ 5 కల్లా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుకు నాంధి పలుకుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత సచివాలయంగా రాష్ట్ర సచివాలయాన్ని ఈ నెల 15 కల్లా తీర్చిదిద్దాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిఫల్ సెక్రటరీ ఎస్.సురేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. "రాష్ట్ర సచివాలయాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడం"పై రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన శిక్షణా సమావేశంలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా అవగాహన శిక్షణా కార్యక్రమానికి హాజరైన అన్ని శాఖల సచివాలయ ఎం.ఎల్.ఓ.లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడటమే కాకుండా మైక్రో ప్లాస్టిక్ కారకాల వల్ల మానవాళి, పశుపక్ష్యాధుల ఆరోగ్యాన్ని ఎంతగానో దెబ్బతీస్తున్నాయన్నారు. పలువురు క్యాన్సర్ బారిన పడి మృత్యు వాతకు గురికావడం కూడా జరుగుచున్నదన్నారు. ఇటు వంటి ప్లాస్టిక్ ను బ్యాన్ చేయాలని ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ఉద్యమాలు జరుగుచున్న నేపథ్యంలో ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి మిషన్ మోడ్ లో అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

ఈ కార్యాచరణ అమల్లో భాగంగా తొలుత రాష్ట్ర సచివాలయం ప్రాంగణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులైన ప్లాస్టిక్ బాటిళ్లు, ప్లాస్టిక్ కప్పులు, ప్లేట్లు, స్టిక్కర్లు, సాచెట్లు మరియు ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల అమ్మకం, పంపిణీ మరియు వాడకంపై తక్షణ నిషేధాన్ని అమలు చేయడం జరుగుచున్నదన్నారు. వీటి స్థానంలో పునర్వినియోగ, బయోడిగ్రేడబుల్ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించేలా చర్యలు చేపట్టడం జరుగుచున్నదన్నారు. రాష్ట్ర సచివాలయంలోని అన్ని బ్లాకుల్లో త్రాగునీరు అందుబాటులో ఉండే విధంగా ఆర్.ఓ. ప్లాంట్లను ఏర్పాటు చేయడం జరుగుచున్నదని, సచివాలయ ఉద్యోగులకు పునర్వినియోగించదగిన స్టెయిన్‌లెస్ స్టీల్ వాటర్ బాటిళ్లను సరఫరా చేయాలని ప్రతిపాదించడమైందన్నారు. అదే విధంగా ఘనద్రవ్య వ్యర్థాల సేకరణకు మూడు రంగుల డస్టు బిన్లను కూడా ఏర్పాటు చేయడం జరుగుచున్నదన్నారు. ఈ విదంగా రాష్ట్ర సచివాలయాన్ని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహితంగా రూపొందించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సహకారంతో అమలు చేయడం జరుగుచున్నదని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సచివాలయ ఉద్యోగులు అందరూ సహకరించాలని ఆయన కోరారు.

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ బి.అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర సచివాలయంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను నియంత్రించేందుకు జిఏడి ప్రిన్సిఫల్ సెక్రటరీ చైర్మన్ గా సెక్రటేరియట్ ప్లాస్టిక్ ఫ్రీ టాస్కుఫోర్సును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ స్థానంలో పర్యావరణ అనుకూలమైన ప్రత్యామ్నాయాలను అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టడం జరుగుచున్నదన్నారు. నేడు రాష్ట్ర సచివాలయంలో ఎం.ఎల్.ఓ.లకు, వెండర్లకు శిక్షణా, సెన్సిటైజేషన్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుచున్నదని, 5వ తేదీన ప్రచార సామాగ్రిని ప్రారంభించడం జరుగుతుందని, 11వ తేదీన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలు ట్రైల్ ను మరియు 15 నుండి పూర్తి స్థాయిలో నిషేదించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు పర్చే విధంగా రాష్ట్ర సచివాలయ ఉద్యోగులు అంతా సహకరించాలని ఆయన కోరారు.

జిఏడి (పొలిటికల్) జాయింట్ సెక్రటరీ సుధాకర్ తో పాటు అన్ని శాఖలకు చెందిన ఎం.ఎల్.ఓ.లు, వెండర్లు ఈ అవగాహన మరియు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థి ప్రథమ చికిత్సలో నిపుణుడవ్వాలి: ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రతి విద్యార్థి ఒక ప్రాణరక్షకుడుగా తయారు అవ్వాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. శుక్రవారం చంద్రమౌళి నగర్ మెయిన్ క్యాంపస్ నందు విద్యార్థులకు సిపీఆర్ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ.... మారిన జీవనశైలిలో కార్డియాక్ అరెస్ట్ ఏ వయసులోనైనా రావచ్చు, ప్రాథమిక ప్రథమచికిత్స తెలిసి ఉండటం తప్పనిసరి అని, ప్రతి విద్యార్థి సీపీఆర్ నేర్చుకోవాలని , ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఉత్సాహంగా చదువు మాత్రమే కాకుండా, ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. ఈ అవగాహన సదస్సులో నన్ను భాగస్వామ్యం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ, రానున్న రోజుల్లో మేము ఏర్పాటు చేసే మెడికల్ క్యాంప్ లలో, ముందుగా ఈ సిపిఆర్ మీద అవగాహన కల్పిస్తామని, ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన భాష్యం రామకృష్ణకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభినందనలు తెలిపారు.

## అడుగడుగునా పూలవర్షం





**నూజివీడు(జర్నలిస్ట్ ఫైల్) :** ఆగిరపల్లి మండలం తోటపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లిన మంత్రి, స్థానికులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను సావధానంగా విన్నారు. గ్రామస్తులు వ్యక్తపరచిన సమస్యలను అక్కడికక్కడే సంబంధిత శాఖాధికారులకు ఫోన్‌లో ఆదేశిస్తూ వెంటనే పరిష్కరించాలని స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. కొంతమంది వృద్ధులు తాము పేదరికంలో ఉన్నామని, సొంత ఇల్లు లేదని, ఇల్లు మంజూరు చేయాలంటూ విన్నవించగా, రికార్డులు పరిశీలించి అవసరమైన స్థలం మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం, గతంలో తెలుగుదేశం హయాంలో పేదలకు స్థలాలు మంజూరు కాగా, కొంతమంది ఇళ్లు నిర్మించుకున్నారని, మరికొంతమంది ఇళ్లు నిర్మాణ ప్రారంభదశలో ఉండగానే వైఎస్సార్‌సీపీ పాలనలో ఆ బిల్లులు చెల్లించలేదని, నిర్మాణాలను అడ్డుకున్నారని వాపోయారు. ఈ విషయాన్ని తాను సీఎం దృష్టికి తీసుకెళ్లగా, ఆ ఇళ్లకు బిల్లులు చెల్లింపు చేస్తామని, నిర్మాణాల ప్రారంభ దశలో ఉన్నవారికి కొత్తగా ఇల్లు మంజూరు చేస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు మంత్రి తెలిపారు.

సొంత ఇల్లు లేని కుటుంబాల వివరాలు వెంటనే సమర్పించాలని అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఇళ్ల యూనిట్ ఖర్చును రూ.4 లక్షలకు పెంచిన విషయాన్ని గుర్తుచేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు నిర్మించి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

ఇంకా, విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని, డ్రైనేజీ సమస్యల వల్ల అనారోగ్య సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, కొంతమందికి వందనం రాలేదని ప్రజలు వివరించగా, ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రతి ఇంటికి వెళ్లిన మంత్రికి ప్రజలు పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు. తమ సమస్యలను వినగానే వెంటనే స్పందిస్తూ అధికారులను ఆదేశిస్తున్న మంత్రిని చూసి స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. మంత్రి వెంట పంచాయతీ అధికారులు, శ్రీనివాసు, తెలుగుదేశం కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఏడేళ్ల తర్వాత ఏపీకి ప్రో కబడ్డీ లీగ్



**విజయవాడ(జర్నలిస్ట్ ఫైల్) :** ఏడేళ్ల తర్వాత ఏపీకి ప్రో కబడ్డీ లీగ్(పీకేఎల్) తిరిగి రావడం సంతోషదాయకమని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైజాగ్ వేదికగా పీకేఎల్ 12వ సీజన్‌లో తెలుగు టైటాన్స్, తమిళ్ తలైవాస్ జట్ల మధ్య ఈనెల 29న తొలి మ్యాచ్ ప్రారంభించబోవడం శుభపరిణామమని వెల్లడించారు. 2018లో ఆంధ్రప్రదేశ్‌లో చివరిసారిగా జరిగిన 6వ సీజన్‌లో క్రీడాభిమానులు, వీక్షకులు అత్యంత అనుభూతిని పొందారని, విశాఖలో జరగబోయే 12వ సీజన్ కూడా ప్రత్యేక అనుభూతిని కలిగిస్తుందని తెలియజేశారు. 12వ సీజన్ కూడా సరికొత్త అధ్యాయంగా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ స్పోర్ట్స్ అథారిటీ సహకరిస్తుందని, ప్రో కబడ్డీ లీగ్‌ను ఏపీలో నిర్వహిస్తున్న నిర్వాహకులకు, అసోసియేట్ పార్టనర్స్, స్పాన్సర్లకు అన్ని విధాలా సహకరిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## ఎల్‌వోసీ చెక్కు అందజేత



**మంగళగిరి టౌన్ (జర్నలిస్ట్ ఫైల్) :** మంగళగిరి పట్టణం ఇస్లాంపేటకు చెందిన షేక్ అబ్దుల్ గఫార్ శ్రీ వెంకటేశ్వర నర్సింగ్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయన వైద్య చికిత్స కొరకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 35 వేలు మంజూరు కాగా ఆ మంజూరు పత్రాన్ని శుక్రవారం గఫార్‌కు అందజేశారు. సీఎం సహాయనిధి నుంచి ఎల్‌వోసీ చెక్కు మంజూరు చేయించిన మంత్రి నారా లోకేష్‌కు గఫార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి పట్టణ అధ్యక్షులు పడవల మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, అబ్దుల్ మజీద్, మహమ్మద్ ఇబ్రహీం, 13వ వార్డు అధ్యక్షుడు షేక్ అమీర్, ప్రధాన కార్యదర్శి షేక్‌అన్వర్ భాష, వంగర హనుమాన్, తోట గౌరీ శంకర్, వార్డు కమిటీ సభ్యులు మొగల్ కరీముల్లా బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాదాయ శాఖలో అందుబాటులోకి ఇ-ఆఫీసు సర్వీసు

## ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, ఆగస్టు1(జర్నలిస్ట్‌ఫైల్):** దేవాదాయ శాఖ ఫైల్స్ అన్ని ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు దేవా దాయ, ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం ఆమె సచివాలయంలో దేవాదాయ శాఖకు సంబంధించి ప్రధాన కార్యాలయం కమిషనరేట్‌లో ఇ-ఆఫీస్ సర్వీసును మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లా డుతూ ఇ-ఆఫీస్ వల్ల దేవాదాయ శాఖలో సంస్కరణలు జరుగుతాయని, ఇదొక గొప్ప ముందడు గన్నారు. ఈ ఆఫీసు ద్వారా ఫైల్స్ త్వరగా, ఆలస్యం లేకుండా క్లియర్ చేయవచ్చన్నారు. డిజిటల్‌గా అన్నీ ట్రాక్ అవుతాయన్న కార ణంగా సిబ్బంది మధ్య అపోహలు ఉండవన్నారు. అలాగే, ఫైల్స్ మాయం కావడం, తడిసిపోవడం, దొంగతనం లేదా అగ్ని ప్రమాదాల్లో నష్టం చెందడం లాంటి సమస్యలు ఉండవన్నారు. ఎక్కడినుంచైనా, ఎప్పుడైనా ఫైల్స్ క్లియర్ చేసే అవకాశం ఉంటుందని, ఉన్నతాధికారులు, ఇఆఫీసు వల్ల వారి కార్యాలయాల్లో భౌతికంగా ఉండాల్సిన అవసరం లేదన్నారు. అత్యవసర ఫైల్స్‌ను ప్రత్యేకంగా గుర్తించేందుకు ట్యాగ్ చేయవచ్చన్నారు. కొద్ది రోజుల్లో యాదగిరిగుట్ట టెంపుల్ సర్వీసులను కూడా డిజిటలైజ్ చేస్తామని, అనంతరం రాష్ట్రంలోని 30 పెద్ద దేవస్థానాలల్లో ఇ-ఆఫీసు సర్వీసులు వినియోగిస్తామన్నారు. దీంతో పాటు పీఏలు, సీసీలు లాంటి మధ్యవర్తుల జోక్యం చాలా తక్కువవుతుందన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖలో ఫైల్స్ క్లియరెన్స్ పనితీరును వేగవంతం ప్రాధాన్యతస్తుందని మంత్రి అన్నారు. అనంతరం దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ మాట్లాడుతూ. ఈ కొత్త విధానం ద్వారా దేవాదాయ శాఖ ప్రధాన కార్యాలయంలో పెండింగ్ ఫైల్ వ్యవహారాలు వేగంగా, పారదర్శకంగా ముందుకు వెళ్ళనున్నాయన్నారు. ఇ-ఆఫీస్ సాఫ్ట్‌వేర్‌ను నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ అభివృద్ధి చేసిందని, దీంతోపాటు అప్లికేషన్ నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు ఉండబోవని, పారదర్శకతకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇ-ఆఫీసు ప్రారంభోత్సవంలో భాగంగా మంత్రి కొండా సురేఖ మొదటి ఫైల్‌ను ఈఅప్లికేషన్ ద్వారా ఆమోదించారు. ఒక కారుణ్య నియామక ప్రక్రియను పూర్తి చేశారు. నవీన్ కుమార్ అనే వ్యక్తికి తన తండ్రి మరణించగా దేవాదాయ శాఖలో ప్రభుత్వ ఉద్యోగాన్ని మంత్రి సురేఖ మంజూరు చేశారు. ఇ-ఆఫీసు ప్రక్రియను విజయవంతంగా చేసినందుకు దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్. వెంకటరావును మంత్రి అభినందించారు. గత 15 రోజులుగా కమిషనర్ స్వయంగా కంప్యూటరైజేషన్ పనులను పర్యవేక్షించారని కొనియాడారు. ప్రతి సిబ్బందికి తగిన శిక్షణ కల్పించారని, ఈ ప్రాజెక్ట్ విజయవంతంగా అమలులోకి రావడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ కమిషనర్ ఎస్. వెంకటరావు, ఎన్ఐసీ జాయింట్ డైరెక్టర్ రాఘవాచారి, టెక్నికల్ మేనేజర్ సవిత తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైలమల్లన్నను దర్శించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, ఆగస్టు1(జర్నలిస్ట్‌ఫైల్):** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివారిని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దర్శించుకున్నారు. అర్చకులు, అధికారులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీశైలమల్లన్నకు ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం వేద ఆశీర్వచనం ఇచ్చి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. శ్రీశైల క్షేత్రంలోని 'తాండ్ర పాపారాయ వెలమ చౌల్ట్రీ' ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన కుర్మయ్యగారి శాంతమ్మ నారాయణరావు భవన్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలు, పదవులు శాశ్వతం కాదని, ఎవరు ఎక్కడ ఉన్నా. సమాజహితం కోసం పాటుపడాలని అన్నారు. కార్యవర్గ సభ్యులు ఒక కుటుంబంగా శ్రీశైలంలో వసతిగృహం నిర్మించుకోవడం సంతోషకరం, అభినందనీయమన్నారు.

# తెలంగాణ యూనివర్సిటీకి ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు

## నాలుగు కోర్సుల్లో అడ్మిషన్లు.. ఈ యేడాది నుంచే అడ్మిషన్ల స్వీకరణ: ప్రభుత్వ ఉత్తర్వులు

**హైదరాబాద్, ఆగస్టు1(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో మరో ఇంజనీరింగ్ కాలేజీకి అనుమతిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ యూనివర్సిటీలో కొత్తగా ఇంజనీరింగ్ కాలేజీని అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా ఏర్పాటు కానున్న యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో 4 కోర్సుల్లో అడ్మిషన్లు తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించిన జీవో ఎంఎస్ నంబర్ 32ను విద్యా శాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంజనీరింగ్ కాలేజీల్లో బిటెక్-సిఎస్‌ఈ, బిటెక్-సిఎస్‌ఈ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్), బిటెక్- కంప్యూటర్ సైన్స్ అండ్ ఐటీ, బిటెక్-డాటా సైన్స్ కోర్సుల్లో ఈ ఏడాది 2025-26 విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు తీసుకోనున్నట్టు విద్యాశాఖ సెక్రెటరీ యోగితా రాణా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఒక్కో కోర్సులో 60 సీట్ల చొప్పున 240 సీట్లను భర్తీ చేయనున్నారు. అయితే ఇప్పటికే ఎప్ సెట్- 2025 సెకండ్ ఫేజ్ కౌన్సెలింగ్ పూర్తయిన నేపథ్యంలో మూడో ఫేజ్‌లో తెలంగాణ యూనివర్సిటీకి మంజూరైన ఇంజనీరింగ్ కాలేజీలో అడ్మిషన్లు తీసుకోనున్నట్టు తెలుస్తోంది.

# రెండు వారాల్లో చేపపిల్లల బకాయిలు చెల్లించాలి

## మత్స్య శాఖ అధికారులకు హైకోర్టు ఆదేశాలు

**హైదరాబాద్, ఆగస్టు1(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలోని జలాశయాల్లో ఉచిత విడుదల చేసేందుకు గాను వివిధ కంపెనీల వద్ద కొనుగోలు చేసిన చేప, రొయ్య పిల్లలను సరఫరా చేసిన వారికి 2 వారాల్లో డబ్బులు చెల్లించాలంటూ మత్స్యశాఖకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. బిల్లులు చెల్లించి గత ఉత్తర్వుల అమలు నివేదికను సమర్పించాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను 2 వారాలకు వాయిదా వేసింది. కాగా తమకు ప్రభుత్వం నుండి రావాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించాలంటూ డిసెంబర్లో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడంతో చేప, రొయ్య పిల్లల పంపిణీదారులు దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్లపై జస్టిస్ ఎన్వీ. శ్రవణ్ కుమార్ విచారించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సాంకేతిక కారణాలతో బిల్లులు చెల్లించకలేకపోయామన్నారు. ప్రస్తుతం రూ.27 కోట్లు మంజూరైందని, త్వరలో బిల్లుల చెల్లిస్తామని చెప్పారు. ఇక పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వినిపిస్తూ పిటిషనర్లకు బిల్లులు విడుదల చేస్తే చాలని ధర్మాసనానికి తెలియచేశారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయస్థానం 2 వారాల్లో బిల్లులు చెల్లించి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈ విచారణకు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ ముఖ్యకార్యదర్శి సభ్యసాచి ఘోష్, మత్స్యశాఖ కమిషనర్ ప్రియాంక ఆల్దైన్ ద్వారా కోర్టు ముందు హాజరయ్యారు. అలాగే నాగర్‌కర్నూల్ కలెక్టర్ బి.సంతోష్, మత్స్య శాఖ సంచాలకులు శ్రీనివాస్ వ్యక్తిగతంగా హాజరయ్యారు.



భూనిర్వాసితులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కవిత

# భూ నిర్వాసితులకు రూ. 40 లక్షలు పరిహారం అందించాలి

## ఎమ్మెల్సీ కవిత డిమాండ్

**దామరగిద్ద, ఆగస్టు1(జర్నలిస్ట్‌ఫైల్):** రైతు లేనిదే రాజ్యం లేదు రైతు ఏడ్చినటువంటి రాజ్యం ఎన్నడూ కూడా బాగుపడదు అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు రాజ్యం బాగుండాలంటే రాష్ట్ర ప్రజలు బాగుండాలి ప్రాజెక్టు బాధితులకు న్యాయం జరిగే వరకు నేను వదిలిపెట్టాను నీళ్లు రానటువంటి పైపుల కోసం ఊరు ముంచడం ఎందుకు రూ. 2900 కోట్ల ప్రాజెక్టు అంచనా ఒకేసారి రూ.4,500 కోట్లకు ఎలా పెరిగిందని ప్రశ్నించారు. ప్రాజెక్టు పని ప్రారంభం కాకముందే అడ్వాన్సుగా 600 కోట్లు ఇవ్వడం ఏమిటని ఎమ్మెల్సీ కవిత అన్నారు దామరగిద్ద మండలం కాన్కుర్తి గ్రామ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ బాధితులతో ఆమె ముఖాముఖి నిర్వహించి మాట్లాడారు కొడంగల్ లో ఉన్న వారు కూడా తమ బిడ్డలేనని వారికి కూడా నీళ్లు రావాలని ఆ ప్రాంత రైతులకు నీళ్లు ఇచ్చేందుకు మధ్యలో ఉన్న రైతులను ఎండబెడతామంటే సరైంది కాదన్నారు పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుతో 1,80,000 ఎకరాలకు నీరు అందేదని అలాంటి ప్రాజెక్టు పూర్తయితే కేసీఆర్కు పేరు వస్తుందన్న ఉద్దేశంతో కేవలం లక్ష ఎకరాలకు సాగు నీరు వచ్చే ప్రాజెక్టును సీఎం రేవంత్ రెడ్డి తీసుకురావడం ఎంతవరకు సమంజసం అన్నారు. ప్రాజెక్టు కింద భూములు కోల్పోతున్న రైతులకు పరిహారంగా 35 లక్షల నుంచి 40 లక్షలు ఇంటికి ఒక ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# పాలేరు అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

## విద్యాభివృద్ధికి 470 కోట్లు ఇచ్చాం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**కూసుమంచి, ఆగస్టు1(జర్నలిస్ట్‌ఫైల్):** పాలేరు ప్రజల ఆశీర్వాదంతో అసెంబ్లీలో అడుగుపెట్టిన తాను, వారి రుణం తీర్చుకునే క్రమంలో పాలేరు నియోజకవర్గంలో విద్యారంగానికి కొత్త ఊపు తెచ్చేందుకు 470 కోట్ల రూపాయలను విద్యాభివృద్ధి కోసం కేటాయించామని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 'పేద పిల్లలు చదువులో వెనుకబడకూడదు.. వారిని మణిరత్నాలుగా తీర్చి దిద్దడమే మా ప్రభుత్వ సంకల్పం' అని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఆయన కూసుమంచి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొ న్నారు. కూసుమంచి పాత జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. 'ఈ భవనాన్ని డిసెంబర్ 31 నాటికి పూర్తి చేసి ఈ ఏడాదిలోనే విద్యార్థుల కోసం ప్రారంభిస్తాం. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చడం నాకు గర్వంగా ఉంది' అని మంత్రి అన్నారు. 'గడచిన 18 నెలల్లో పాలేరు నియోజకవర్గానికి రూ. 470 కోట్ల నిధులు విద్యాభివృద్ధికి కేటాయించాం. ఐటీఐ, నైపుణ్య విశ్వవిద్యాలయం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ వంటి ప్రాజెక్టులు ఈ ప్రాంతానికి కొత్త శకం తెస్తాయి. చదువు అందరికీ చేరేలా ప్రభుత్వ కృషి కొనసాగుతుంది' అని మంత్రి వివరించారు. పిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 8వ తరగతి చదువుతున్న 76 మంది బాలికలకు సైకిళ్లను పంపిణీ చేశారు. వచ్చే ఏడాది నుంచి జూనియర్ కళాశాలలో చేరుతున్న విద్యార్థినీలకు కూడా సైకిళ్లు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా రాణించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, అన్ని శాఖల, విభాగాల ప్రత్యేకాధి కారులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు గనుల మూసివేత ప్రాంతాల్లో జీవనోపాధి : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు1(జర్నలిస్ట్‌ఫైల్):** బొగ్గు గనుల మూసివేత వల్ల ప్రభావితమైన ప్రాంతాలలో జీవనోపాధికి మద్దతు ఇవ్వడం, పునరుత్పాదక శక్తిని ప్రోత్సహించడం, ఆహార భద్రతను బలోపేతం చేయడం లక్ష్యంగా కేంద్రం అనేక కార్యక్రమాలను చేపట్టిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్‌రెడ్డి తెలిపారు. లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు గురువారం కేంద్ర మంత్రి సమాధానంగా జనవరి 31, 2024న జారీ చేయబడిన మైనింగ్ ప్లాన్, మూసివేత మార్గదర్శకాల ప్రకారం, గనుల మూసివేత వల్ల ప్రభావితమైన కుటుంబాలకు పునరావాసం మరియు పునరావాస వ్యూహాలపై కేంద్ర ప్రభుత్వం చురుకుగా పనిచేస్తోందన్నారు. న్యాయమైన పరివర్తన ను నొక్కి చెబుతూ, కార్మికులు, సమాజం, పర్యావరణంపై ప్రతికూల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. కాగా సభ్యులు అడిగిన మరో ప్రశ్నకు కేంద్ర ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద యెస్సోనాయక్ జవాబిస్తూ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులపై నవీకరణలను అందిస్తూ, జూన్ 30, 2024 నాటికి దేశ వ్యాప్తంగా 43,922 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన స్థాపిత సామర్థ్యాన్ని సాధించిందని చెప్పారు. ఇందులో సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎన్టీపీసీ, ఇతర ఏజెన్సీల సహకారాలు ఉన్నాయని పేర్కొన్నారు. కేంద్రం విద్యుత్ అమ్మకపు ఒప్పందాల (పిఎస్ఎ) సంతకాలను వేగవంతం చేసిందని చెప్పారు. అలాగే సౌర మరియు పవన శక్తి మౌలిక సదుపాయాల వృద్ధిని సులభతరం చేయడానికి నవీకరించబడిన బిడ్డింగ్ మార్గదర్శకాలను కూడా జారీ చేసినట్లు వెల్లడించారు.

# పులులకు విషం పెట్టి చంపొద్దు.. అది నేరం

## అటవీశాఖ ముఖ్యకార్యదర్శి సువర్ణ

**హైదరాబాద్, ఆగస్టు1(జర్నలిస్ట్‌ఫైల్):** నగరం చుట్టూ అటవీ ప్రాతం అంతరించడంతో పులులు బయటకు వస్తున్నాయని అటవీశాఖ ముఖ్య కార్యదర్శి సువర్ణ అన్నారు. గురువారంఆమె అరణ్యభవన్‌లో మీడియా ప్రతినిధులతో సవవేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ... పులి కంటే చిరుతపులి తెలువైంది. చిరుత ఒఆర్ఆర్ రెండుసార్లు దాటింది. ఇప్పటి వరకు ఎవరిపైనా దాడి చేయలేదు ఆ తర్వాత అది ఫారెస్ట్‌లోకి వెళ్ళిందన్నారు.

నగరం చుట్టూ వక్కల అటవీ ప్రాంతం అంతరించడం, వాటికి అడవిలో సరైన ఆహారం దొరక్కపోతే బయటకి వస్తున్నట్లు తెలిపారు. జంతువులు, మానవులపై ఎక్కువ దాడి చేసే అవకాశం ఉందన్న ఆమె నగరంలో చిక్కిన మగ చిరుత 5నుండి 6 సంవత్సరాల వయస్సు ఉంటుంది. ఈ ఒక్క చిరుతకే ఇంత సమయం పట్టిందన్నారు.

రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో అవి ఇంకా తిరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి మూడు వారాల తర్వాత ఈరోజు మంచిరేవులలో చిరుత చిక్కిందన్నారు. క్రూర మృగాల దాడిలో మనుషులు చనిపోతే పది లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటిస్తున్నాం. కానీ విషం పెట్టి వీటిని చంపొద్దు. చంపితే అటవీ చట్టం కేసులు నమోదు అవుతాయని ఆమె హెచ్చరించారు. పులుల సమాచారం ఉంటే.. టోల్‌ఫ్రీ 040 23231772కి కాల్‌చేసి సమాచారం ఇవ్వాలని ఈ ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఫారెస్టు సీనియర్ ఆఫీసర్ శంకరన్ మాట్లాడుతూ.. చిరుత పులుల సంచారం పెరుగుతుంది కాని, పులుల సంతానం పెరగలే దన్నారు. మహారాష్ట్ర నుంచి ఎక్కువగా వస్తున్నాయని, మహబూబ్ నగర్‌లో రెండు చోట్ల చిరుత పులులు సంచరిస్తూ మను షుల మీద దాడులు చేస్తున్నాయన్నారు. చిలు కూరు ప్రాంతంలో ఉన్న చిరుతను పట్టుకు న్నామని, గతంలో ఒక చిరుతను పట్టుకో వాలం టే మూడు నెలలు పట్టింది చిలుకూరు ఇప్పుడు ఎలాంటి ఇబ్బంది లేకుండా సునా యసంగా చిరుతను పట్టుకున్నమని, ఇందుకు వాకర్స్ కూడా ఎంతో సహకరించినట్ల ఆమె తెలిపారు.

# ఎట్టకేలకు ఎరకు చిక్కిన 'చిరుత'

## ఊపిరి పీల్చుకున్న శివారు గ్రామాల ప్రజలు

## రాత్రివేళల్లో యథేచ్ఛగా తిరిగిన పులి

## ఫలించిన అధికారుల పదిరోజుల ప్రయత్నం



మంచిరేవుల ఫారెస్ట్ ట్రెక్ పార్కులో ఏర్పాటు చేసిన మేక ఎరకు చిక్కిన చిరుత ఇదే.

**హైదరాబాద్ (నార్సింగి), ఆగస్టు1(జర్నలిస్ట్‌ఫైల్):** హైదరాబాద్ మహా నగర శివారుల్లో గత పది రోజులుగా మూడు మండలాల ప్రజలను వణికించిన 'చిరుత' ఎట్టకేలకు ఎరకు చిక్కింది. గండిపేట మం డలం మంచిరేవుల గ్రామంలో ఉన్న ఫారెస్ట్ ట్రెక్ పార్కులో మేక పిల్లను ఎరగా వేసిన బోనులోకి వచ్చి పట్టు బడింది చిరుతపులి. అటవీ శాఖ అధికారులు ఈ చిరుతను జూపార్కుకు తరలించారు.

దీంతో ఇటు స్థానిక ప్రజలు, అటు అటవీశాఖ అధికారులు ఊపి రి పీల్చుకున్నారు. పది రోజుల క్రితం మంచిరేవులలో ఉన్న వ్యాస్‌నగర్‌లో గ్రేహౌండ్స్ పోలీసులు మార్నింగ్ వాక్ చేస్తుండగా చిరుతపులి కనిపించింది. దాన్ని చూసిన పోలీసులు వెంటనే నార్సింగి పోలీసులకు సమాచారం అంద జేశారు. వారు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి వచ్చి చిరుత పాదాల ఆనవాళ్లను పరిశీలించి ఇక్కడ సంచరించేది చిరుతపులేనని తేల్చారు.

అటవీ శాఖ అధికారులు ఈ చిరుతను పట్టుకునేందుకు మృగవని పార్కు, ఫారెస్ట్ ట్రెక్ పార్కు, వ్యాస్ నగర్ ప్రాంతాలలో బోన్‌లను, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి చిరుత కదలికలను పరిశీలించడం ప్రారంభించారు. బోన్‌లలో ఎరగా మేక పిల్లలను ఉంచారు. రెండు రోజుల తరువాత మంచిరేవులలో ఏర్పాటు చేసిన ఓ కెమెరాకు రోడ్డు దాటుతూ కనిపించింది. ఆ పరిసర ప్రాంతాలలో అధికా రులు నిఘాను పెంచారు.

మరో మూడు రోజుల తరువాత గోల్కొండ తారామతి బారాదరి వద్ద రోడ్డు దాటుతూ సీసీ కెమెరాకు చిక్కింది. దాంతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. చిరుత పట్టుబడేంత వరకు మార్నింగ్ వాక్‌లకు కూడా వెళ్లవద్దని హెచ్చరించారు.

**ఎరకు చిక్కిన చిరుత**

అటవీ శాఖ అధికారులు వేసిన మేక ఎరకు చిరుత చిక్కింది. ఆహారం కోసం, స్థావరం కోసం చిరుత ఫారెస్టు ట్రెక్ పార్కుకు గాని, మృగవని పార్కుకు గాని తిరిగి వస్తుందని, ఈ పార్కులలోనే జింకలు, కుందేళ్లు ఉండడం వలన అధికారులు ఇక్కడే 4 బోన్లను, 14 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి చిరుత కదలికలను నిశితంగా పరిశీలించసాగారు. చిరుత గురువారం తెల్లవారుజామున ఫారెస్టు ట్రెక్ పార్కు వద్ద ఏర్పాటుచేసిన బోనులో మేకను తినేందుకు వెళ్లి పట్టుబడింది. అటవీ శాఖ అధికారులు చిరుత పట్టుబడిన సీసీ పుటేజిని పరిశీలించి దాన్ని బంధించి సురక్షితంగా హైదరాబాద్‌లోని జూ పార్కుకు తరలించారు.

# జాతీయస్థాయి టి స్కాన్ యూత్ ఓపెన్ రెగట్టా పోటీల్లో బిసి గురుకుల విద్యార్థులకు పతకాలు

## శిరీష రజతం, హనుమంతు కాంస్యం

**హైదరాబాద్, ఆగస్టు1(జర్నలిస్ట్‌ఫైల్):** జాతీయ స్థాయిలో జరిగిన టి స్కాన్ యూత్ ఓపెన్ రెగట్టా పోటీల్లో బిసి గురుకుల విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించారు. యాచ్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ ఓపెన్ రెగట్టా ఆప్టిమిస్ట్ మెయిన్ ఫ్లీట్ విభాగంలో చాంద్రాయణ గుట్ట గర్ల్స్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న జె శిరీష వెండి పతకం సాధించగా, మునుగోడు బాయ్స్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న వి హనుమంతు కాంస్య పతకం సాధించాడు. కల్వకుర్తి గర్ల్స్ స్కూల్ లో ఏడవ తరగతి చదువుతున్న ఎం అక్షర జాతీయ స్థాయిలో నాలుగో స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయి పోటీలో పతకాలు సాధించిన విద్యార్థులను బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్యదర్శి శ్రీధర్, మహాత్మా జ్యోతిబా పూలే బిసి గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు అభినందించారు. బిసి గురుకులవిద్యార్థులకు చదువుతో పాటు వారిలోనైపుణ్యాలను, ఆసక్తిని గమనించి అనేక అంశాలపై శిక్షణ ఇచ్చేందుకు బిసి గురుకుల విద్యాసంస్థ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని సొసైటీ సెక్రటరీ సైదులు తెలిపారు. అందులో భాగంగా బిసి గురుకుల విద్యార్థులకు యాచ్ క్లబ్ ఆధ్వర్యంలో హుస్సేన్ సాగర్ లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. శిక్షణలో అసాధారణ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇవ్వడంతో పాటు వారు జాతీయ, అంతర్జాతీయపోటీల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు మూడు దఫాలుగా శిక్షణ ఇచ్చామన్నారు. జూలై 1వ తేదీ నుంచి జూలై 20వ తేదీ వరకు మూడో విడత శిక్షణ ఇచ్చామని వారిలో జాతీయ స్థాయిలో ముగ్గురు విద్యార్థులు పతకాలు సాధించడం ఆనందంగా ఉందని గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను 2026 లో జరిగే ఆసియన్ గేమ్స్, 2028 జరిగే ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. అందుకు అవసరమైన శిక్షణ అందిస్తామని తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సూర్యకిరణ్, ఎంఎల్‌సి దాసోజు శ్రావణ్, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, రచయిత యష్‌పాల్ తదితరులు

# 6న 'గద్దర్' ద్వితీయ వర్ధంతి సభ

**హైదరాబాద్, ఆగస్టు1(జర్నలిస్ట్‌ఫైల్):** ప్రజాయుద్ధ నౌక గద్దర్ ద్వితీయ వర్ధంతి సభ ఈ నెల 6న మధ్యాహ్నం 2 గంటల నుంచి హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరుగతుందని గద్దర్‌ఫౌండేషన్ చైర్మన్ సూర్యకిరణ్ తెలిపారు. ఈ మేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఎంఎల్‌సి దాసోజు శ్రావణ్, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌లతో పాటు వివిధ ప్రజాసంఘాల నేతలతో కలిసి వర్ధంతి సభ పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ అధ్యక్షతన జరిగే వర్ధంతి సభలో ప్రజా ప్రతినిధులు, సినీ ప్రముఖులు, మేధావులు, రచయితలు, కళాకారులు పాల్గొని తమ సందేశాన్ని వినిపిస్తారన్నారు. అలాగే వివిధ ప్రజా సంఘాల నేతలు, తెలంగాణ ఉద్యమ కారులు, పాత్రికేయులు, విద్యార్థి, యువజన, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. అలాగే రాజ్యాంగాన్ని కాపాడుకుందాం, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సేనోటు డ్రగ్స్ అనే నాటికలను ప్రదర్శించటం జరుగుతుందని తెలిపారు. అలాగే గద్దర్ రాసిన సాహిత్యంలోంచి సామాజిక ఆర్థిక అసమానతల పై రాసిన పాటల ప్రదర్శన ఉంటుందన్నారు. గద్దర్ సమగ్ర సాహిత్యాన్ని ప్రచురించాలనే లక్ష్యంతో ముందుకు పోతున్న ఫౌండేషన్ రెండో వర్ధంతి సందర్భంగా గద్దర్ రాసిన మా పల్లె, ప్రతి పాటకు ఒక కథ ఉంది పుస్తకాల ఆవిష్కరణ ఉంటుందన్నారు. అలాగే గద్దర్ జీవితాంతం చేసిన కృషి, ఆచరించిన విలువలపై ఆయన స్మృతిలో అనేమంది కవులు, కళాకారులు, రచయితలు రచనలతో రూపు దిద్దుకొన్న గద్దర్ యాదిలో పాలధార పాట పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు సూర్యకిరణ్ పేర్కొన్నారు.




# బిసి బిల్లుకు కేంద్రంలో బిజెపి అడ్డుపడుతోంది

## కాంగ్రెస్‌తో స్నేహధర్మాన్ని పాటిస్తూనే.. ప్రజాసమస్యలపై ఉద్యమిస్తాం

## రాష్ట్ర మహాసభలో ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తాం: సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**హైదరాబాద్, ఆగస్టు1(జర్నలిస్ట్‌ఫైల్):** రాష్ట్రంలో స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన బిసి బిల్లుకు బిజెపి పెద్ద అడ్డంకిగా మారిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. బిసి బిల్లుకు బిజెపి అడ్డుపడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంపిన బిసి బిల్లులను గత 4 నెలలుగా తొక్కి పెట్టడం సరికాదని, ఆర్డినెన్స్ ఆమోదం విషయంలో సైతం ఇదే విధంగా వ్యవహరించడం సమాజసం కాదన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో గురు వారం కూనంనేని సాంబశివరావు మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బిసి బిల్లునే కాకుండా ఎస్‌సి వర్గీకరణ అమలుకు సంబంధించి ద్వంద వైఖరి అలంభిస్తోందని కూనంనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధుల పార్టీ ఫిరాయింపులకు సంబంధించి స్పీకర్ మూడు నెలలలోపు నిర్ణయం తీసుకో వాలని సుప్రీంకోర్టు తీర్పు నిచ్చిందని.. అయితే ఈ చట్టంలోని లోసుగుల కారణంగా అది సాధ్యమా అని కూనంనేని సాంబశివరావు ప్రశ్నించారు. బిజెపిలో బిఆర్ఎస్ విలీనానికి సంబంధించి ఇటు బిజెపి, అటు బిఆర్ఎస్ మధ్య మాటల యుద్ధాన్ని కట్టిపెట్టి .. ఇందుకు సంబంధించిన వాస్తవాలను మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కె చంద్రశేఖరరావు వెల్లడించి తమ చిత్తశుద్ధిని నిరుపించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఈ నెల 19 నుంచి 21 వరకు జరగనున్న సిపిఐ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు ఈనెల 19 నుంచి 21 వరకు మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో ఘనంగా జరగనున్నాయని కూనంనేని సాంబశివరావు చెప్పారు. మహాసభలు జరిగే ప్రాంతానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, దివంగత 'ఎన్.బాలమల్లేష్ నగర్'గా నామకరణం చేసినట్లు చెప్పారు. అధికార పార్టీతో ఉన్న స్నేహ ధర్మాన్ని పాటిస్తునే ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యమిస్తున్నామని కూనంనేని చెప్పారు.

# రాజమండ్రిలో రిలయన్స్ 'ఫ్యాషన్ ఫ్యాక్టరీ' ప్రారంభం

- రూ.2499 షాపింగ్ చేస్తే రూ.2499 విలువ చేసే దుస్తులు ఉచితం
- రూ.2500 పైగా షాపింగ్ చేస్తే 12 పీసుల డిన్నర్ సెట్ ఉచితం




**రాజమండ్రి, ఆగస్టు 1(జర్నలిస్ట్‌ఫైల్):**

భారతదేశంలో అతి పెద్ద రిలయన్స్ రిటైల్ రాజమండ్రిలో మొదటి 'ఫ్యాషన్ ఫ్యాక్టరీ' స్టోర్ ను ప్రారంభించింది. ఈ స్టోర్ సెంట్రల్ జైలు రోడ్డులో సెంట్రల్ వేర్‌హౌస్‌కు ఎదురుగా ఉంది. ప్రారంభ సందర్భంగా ప్రత్యేక ఆఫర్లను కస్టమర్లకు అందుబాటులో ఉంచింది. రూ.2499 షాపింగ్ చేసి, రూ.2499 విలువ చేసే దుస్తులు ఉచితంగా పొందవచ్చు. రూ.2500 పైగా షాపింగ్ చేసి రూ.1445 విలువ చేసే 12 పీసుల డిన్నర్ సెట్ ఉచితంగా పొందవచ్చు. ఈ ఆఫర్లు ఆగస్టు 2, 3 తేదీలలో మాత్రమే వర్తిస్తాయి. ఫ్యాషన్ ఫ్యాక్టరీ స్టోర్‌లో మహిళలు, పురుషులు, పిల్లల కోసం విశాలమైన కలెక్షన్ ఉంది. వెస్టర్న్, ఎత్నిక్, క్యాజువల్, ఫార్మల్, ఫ్యూజన్, అథ్‌లెషర్, స్పోర్ట్స్ వేర్ లాంటి 20,000 పైగా స్టైల్స్ అందుబాటులో ఉన్నాయి. దుస్తులు, షూస్, హ్యాండ్‌బ్యాగ్స్, లగేజ్, యాక్సెసరీస్‌తో ప్రతి సందర్భానికీ ఒకే చోట పూర్తి షాపింగ్ అనుభవం పొందవచ్చు. దైనందిన వాడుక నుంచి పార్టీలు, పండుగలు, పెళ్లిళ్ల వరకు అన్ని రకాల అవసరాలకు ఒకే చోటు.. అదే రిలయన్స్ 'ఫ్యాషన్ ఫ్యాక్టరీ' రెండు వందలకు పైగా జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లతో ఫ్యాషన్ ఫ్యాక్టరీ రాజమండ్రి వాసులకు విలువైన షాపింగ్ అనుభవం ఇవ్వనుంది. ఫ్యాషన్ ఫ్యాక్టరీ ప్రత్యేకత కలిగిన ఫ్యాషన్ గమ్యస్థానం. సంవత్సరం అంతా 20 నుంచి 70 శాతం వరకు డిస్కౌంట్లు అందించే ఈ స్టోర్‌లో మీరు 'బ్రాండ్స్ ఫర్ లెస్' అనే హామీతో ఫ్యాషన్ ప్రియులు, బ్రాండ్‌లపై ఆసక్తి కలిగిన కస్టమర్లకు ఉత్తమ విలువను అందిస్తుంది. 17,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ స్టోర్, ఆధునిక ఇంటీరియర్, పురుషులు, మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక విభాగాలు ఉన్నాయి. లెవీస్, పెపే, స్పైకర్, ప్యూమా, స్కెచర్స్, రేమండ్, పార్క్ అవెన్యూ, జాన్ ప్లేయర్స్, విశుధ్ ఇంకా ఎన్నో బ్రాండ్లు కలవు. వెంటనే త్వరపడండి. ఆకర్షణీయమైన ఆఫర్లను ఆస్వాదించండి.

# కొల్లూరికి మరో అరుదైన అత్యున్నత పురస్కారం

- వైశ్య రత్న జాతీయ అవార్డుకు ఎంపిక
- డా. కొల్లూరికి పలువురు అభినందనలు



**పెడన, ఆగస్టు 1(జర్నలిస్ట్‌ఫైల్):**

కృష్ణాజిల్లా, పెడన పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు, అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి (ఆప్స్) వ్యవస్థాపకులు, సమాజ సేవకులు, ప్రజా సేవకులు గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీత డా. కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) పెడన పట్టణ పరిసర ప్రాంత పేద ప్రజలకు ఆర్యవైశ్య స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా చేస్తున్న నిస్వార్థ సేవలకు డా. కొల్లూరి కి అత్యున్నత గౌరవ పురస్కారం లభించిం ది. హైదరాబాద్ కి చెందిన హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ వ్యవస్థాప కులు కొంపల్లి సత్యనారాయణ సేవా రంగంలో డా. కొల్లూరి ని వైశ్య రత్న జాతీయ అవార్డు కు ఎంపిక చేయడం జరిగింది. హైదరాబాద్ కి చెందిన హ్యూమ న్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ సర్వీస్ సంస్థ వారు ఆగస్టు 10న హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమంలో డా. కొల్లూరి వైశ్య రత్న జాతీయ అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ కృష్ణాజిల్లా ఆర్యవైశ్య సంఘం పెడన మండల ఆర్యవైశ్య సంఘం పెడన పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆర్యవైశ్య యువజన సంఘం శ్రీ వాసవి మహిళా మండలి కేసిజిఎఫ్ వాసవి క్లబ్ పొట్టి శ్రీరాములు పెడన తదితర స్వచ్ఛంద సేవా ప్రతినిధులతో పాటు పట్టణ పుర ప్రముఖులు పలువురు డా. కొల్లూరి కి అభినందనలు తెలియజేశారు.

# పి హెచ్ డి డిగ్రీ ప్రధానం




**ఆగిరిపల్లి, ఆగస్టు 1(జర్నలిస్ట్‌ఫైల్):**

ఆగిరిపల్లి సమీపంలో ఉన్న ఎన్, ఆర్, ఐ, ఇనిస్ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, (డేటా సైన్స్) విభాగాధిపతి అసోసియేట్ ప్రొఫెసర్ గా సేవలు అందిస్తున్న చింత, వెంకట మురళీకృష్ణకు, గీతం (డీమ్డ్ టు బి) యూనివర్సిటీ విశాఖపట్నం, వారిచే పీహెచ్డీ డిగ్రీ ప్రధానం చేశారు. గీతం టు బి యూనివర్సిటీ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆచార్యులు, డా: జి అప్పారావు, పర్యవేక్షణలో ఇంపాక్ట్ కాన్ టెక్చువల్ సెగ్మెంట్స్ ఆన్ ది ఓవర్ ఆల్ రేటింగ్ ఇన్ మల్టీ క్రైటీరియా ట్రావెల్ రికమండల్ సిస్టం, అను అంశంపై పరిశోధన గావించారు. తన పరిశోధన కాలంలో చింత వెంకట మురళీకృష్ణ ఎస్ సి ఐ 1 మరియు స్కొపస్ ఇండెక్సడ్ జర్నల్స్ 4 ప్రచురించారు. ఎన్ ఆర్ ఐ కళాశాల చైర్మన్ డా: ఆర్, వెంకటరావు, ప్రిన్సిపల్ డాక్టర్ సి, నాగ భాస్కర్, అకాడమిక్ డా: జి, సాంబశివరావు, తదితరులు చింత, వెంకట మురళీకృష్ణ కు అభినందనలు తెలియజేశారు.

## పదవి విరమణ చేపట్టిన సమాచార శాఖ

# పబ్లిసిటీ అసిస్టెంట్ చోరగుడి జాక్సన్ బాబు




**విజయవాడ, ఆగస్టు 1(జర్నలిస్ట్‌ఫైల్):**

రాష్ట్ర సమాచార కేంద్రం, విజయవాడలో పబ్లిసిటీ అసిస్టెంట్ గా పనిచేస్తూ పదవి విరమణ చేసిన చోరగు డి జాక్సన్ బాబు యొక్క వీడ్కోలు సమావేశాన్ని రాష్ట్ర సమచార మరియు పౌర సంబంధాల కమిషనర్ కార్యాలయంలో గురువారం నిర్వహించడం జరిగింది. 30 సంవత్సరాలు విధిగా తన భాద్యతలను నిర్వర్తిస్తూ తనదైన శైలిలో సేవలు అందించిన చోరగుడి జాక్సన్ బాబుకు పదవి విరమణ శుభాకాంక్షలను తెలియజేస్తూ తను సేవలకు గుర్తుగా సమాచార శాఖ ఉద్యోగులంతా కలిసి ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సమచార మరియు పౌర సంబంధాల శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీమతి స్వర్ణలత, జాయింట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ మరియు ఇతర అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర సమచార మరియు పౌర సంబంధాల శాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీమతి ఎల్ .స్వర్ణలత మాట్లాడు తూ, జాక్సన్ బాబు దాదాపు 30 సంవత్సరాల పాటు నిర్విరామంగా పుబ్లిసిటీ అసిస్టెంట్‌గా సేవలు అందిం చారని, ఉద్యోగ రిత్యా ఎన్నో రోజులు కుటుంబా నికి దూరంగా ఉండాల్సి వచ్చిన సందర్భంలో కూడా సంయమనం కోల్పోకుండా భాద్యతలు నిర్వర్తించారని తెలియజేస్తూ పదివి విరమణ చేపడుతున్న జాక్సన్ బాబుకి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సమచార మరియు పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్ మాట్లాడుతూ జాక్సన్ బాబుకు పదవి విరమణ శుభాకాంక్షలను తెలియచేసారు. పబ్లిసిటీ అసిస్టెంట్ గా జాక్సన్ బాబు అందించిన సేవలు ఏంటో గొప్పవని, టెక్నాలజీ పూర్తిగా అందుబాటులో లైని రోజుల్లో ప్రభుత్వం తమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడానికి పబ్లిసిటీ అసిస్టెంట్ లను విరివిగా ఉపయోగించుకునే వారని, అటువంటి సమయంతో సంబంధం లేకుండా పనిచేయాల్సి వచ్చిన జాక్సన్ బాబు ఎంతో ఓర్పుగా చేసేవారని, పుష్కరాలు, వరదలు వంటి అనేక సందర్భాల్లో కలిసి పనిచేశామని ఇక పైన ఆయన సేవలు దూరమవడం బాధాకరం అన్నారు. అనంతరం రాష్ట్ర సమాచార కేంద్రం విజయవాడ సహాయ సంచాలకులు ఎమ్. భాస్కర్ నారాయణ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల పాటు తానూ జాక్సన్ బాబు కలసి పని చేశామని, తన పనిని ఎంతో ఓర్పుగా నిర్వర్తిస్తారని, చేసే పనిలో ఎటువంటి లోపాలకు చోటివ్వకుండా ఎంతో సహకారం అందించే వారని తెలుపుతూ జాక్సన్ బాబుకు పదవి విరమణ శు భాకాంక్షలను తెలియచేసారు. ఈ పదవి విరమణ కార్యక్రమానికి రాష్ట్ర సమచార మరియు పౌర సంబం ధాల శాఖ డెప్యూటీ డైరెక్టర్ పూర్ణచంద్ర రావు, అసిస్టెం ట్ డైరెక్టర్ వెంకటరామరాజు గౌడ్, నారాయణ రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ సుదర్శన్, ఎన్ టీ ఆర్ జిల్లా సమచార శాఖ డిఐపిఆర్ఓ రమణ, డిపిఆర్ఓ మోహన్, డివిజనల్ పిఆర్ఓ రవి, ఎవిఎస్ ప్రసాద్ మరియు తదితర సిబ్బంది హాజరయ్యారు.

# నిబద్ధతకు మారుపేరు 'ఉమ్మడిశెట్టి'





**విజయవాడ పశ్చిమ, ఆగస్టు 1(జర్నలిస్ట్‌ఫైల్):**

నిర్దిష్ట ప్రణాళికతో విద్యార్థులకు విద్యా బోధన చేస్తూ నిబద్ధతకు మారుపేరుగా ఎస్ కే పి వి హిందూ హై స్కూల్స్ గణిత శాస్త్ర ఉపాధ్యాయులు ఉమ్మడిశెట్టి వెంకటేశ్వరరావు నిలిచారని ఎస్ కే పి వి ఇందు హై స్కూల్స్ కమిటీ కార్యదర్శి కె ఎల్ వి మోహన్ రావు కొనియాడారు. 36 సంవత్సరాలుగా గణిత శాస్త్ర ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహించిన ఉమ్మడిశెట్టి వెంకటేశ్వరరావు పదవీ విరమణ కార్యక్రమం హిందూ హైస్కూల్ ఆవరణలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మోహన్ రావు హిందూ హై స్కూల్స్ కమిటీ ఉపాధ్యక్షులు అన్నం రామకృష్ణారావు, కేబీఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ తూనికుంట్ల శ్రీనివాస్ లతో కలిసి తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కమిటీ ఉపాధ్యక్షులు అన్నం రామకృష్ణారావు మాట్లాడుతూ హిందూ హైస్కూల్ కు సుమారు 125 ఏళ్ళ ఘనచరిత్రలో వేలాదిమంది విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలబెట్టిన గురుతుల్యులు ఉండటం పాఠశాల గర్వకారణం అన్నారు. ఉమ్మడిశెట్టి వెంకటేశ్వరరావు గత 36 సంవత్సరాలుగా విద్యా సేవలో తరించి ఆదర్శప్రా యంగా నిలిచారని చెప్పారు. కేబీఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ తూనికుంట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ హిందూ హై స్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అన్ని ఇన్స్టిట్యూషన్స్ నిబద్ధత అంకిత భావంతో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ఉండటంతో పాటు, ఆధ్యాత్మిక, ఆరోగ్య, సేవా సంబం ధిత ప్రత్యేక కార్యక్రమాలను సైతం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఉద్యోగ విరమణ చేస్తున్న యు వెంకటేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ కే పి వి వి హిందూ హైస్కూల్ కమిటీ అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ వి. నారాయణ రావు, కేబిఎన్ కళాశాల ఎగ్జిక్యూటివ్ అధికారి ఎన్. శ్రీనివాసరావు, హిందూ హైస్కూల్ ప్రధానోపా ధ్యాయుడు కంచర్ల శ్రీనివాసరావు, అసిస్టెంట్ ప్రధానో పాధ్యాయుడు ఎస్. భరత్ కుమార్, ఉపాధ్యాయుల ప్రతినిధి బ్రహ్మేశ్వర రావు, ఉపాధ్యాయిని ఉపాధ్యా యులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఇండియన్ నెఫ్రాలజీ

# సొసైటీ సదరన్ చాప్టర్ వార్షిక సదస్సు

- ఎస్ఎస్ కన్వెన్షన్ నందు మూడు రోజుల పాటు కార్యక్రమాలు
- సదస్సుకు హాజరుకానున్న 600 మంది ప్రతినిధులు
- సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ డి. శ్రీహరి రావు
- 44వ వార్షిక సదస్సు బ్రోచర్లను ఆవిష్కరించిన ప్రఖ్యాత నెఫ్రాలజిస్టు డాక్టర్ నలమాటి అమ్మన్న తదితరులు




**విజయవాడ, ఆగస్టు 1(జర్నలిస్ట్‌ఫైల్):**

మూత్రపిండాల వ్యాధులకు సంబంధించిన అత్యాధు నిక వైద్య చికిత్సల గురించి చర్చించేందుకు నగరంలోని ఎస్ఎస్ కన్వెన్షన్ వేదిక కానుంది. ఇండి యన్ నెఫ్రాలజీ సొసైటీ సదరన్ చాప్టర్ 44వ వార్షిక సదస్సు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిం చనున్నట్లు ప్రఖ్యాత నెఫ్రాలజిస్టు డాక్టర్ నలమాటి అమ్మన్న తెలిపారు. సదస్సుకు సంబంధించిన బ్రోచర్లను ఆయన ఆవిష్కరించారు. సూర్యారావుపేటలో గురువా రం జరిగిన కార్యక్రమంలో డాక్టర్ అమ్మన్న మాట్లాడు తూ.. శుక్రవారం సాయంత్రం జరిగే ప్రారంభోత్సవ వేడుకలో ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ డి. శ్రీహరి రావు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన దాదాపు 600 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతారని వెల్లడించారు. అత్యాధునిక నెఫ్రాలజీ చికిత్సలు, ఆధునిక ఔషధాలు, నవీన ఆవిష్కరణ గురిం చి చర్చించేందుకు ఈ సదస్సు వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. నెఫ్రాలజీ వైద్య విభాగానికి సంబంధించి విజ్ఞాన సర్వస్వంగా ఈ సదస్సుకు రూపకల్పన చేసినట్లు తెలిపారు. వివిధ అంశాలపై నిపుణుల ప్రసంగాలు, ఆధునిక చికిత్సా విధానాలపై విశ్లేషణలు, చికిత్సల్లో ఎదురయ్యే సంక్లిష్టతలపై సదస్సులో చర్చా కార్యక్రమాలు జరుగుతాయని డాక్టర్ అమ్మన్న వివరించారు. దక్షిణ భారతదేశంలోని నెఫ్రాలజిస్టులకు, యువ వైద్య నిపుణులకు తమ పరిజ్ఞానాన్ని పెంపొందిం చుకోవడానికి ఈ సదస్సు గొప్ప అవకాశం అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాధిక, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరాదిని ఊపేస్తున్న భారీ వర్షాలు



## హిమాచల్‌లో ఇప్పటివరకూ 170 మంది మృతి

## 301 రహదారుల్లో రాకపోకలు నిలిపివేత

### రాజస్థాన్, ఢిల్లీల్లోను కుంభవృష్టి

**సిమ్లా, ఆగస్టు1 :** ఉత్తరాది రాష్ట్రాల్లో గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు బీభత్సాన్ని సృష్టించాయి. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్‌లో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్‌లో భారీ వర్షాల కారణంగా భారీ సంఖ్యలో ప్రాణ నష్టం సంభవించింది. కొండచరియలు విరిగిపడటం వల్ల పలు రహదారులను బ్లాక్ చేశారు. అలాగే మరో రెండు రోజులపాటు భారీవర్షాలు కరిసే అవకాశముందని భారతవాతావరణశాఖ అంచనా వేసింది. హిమాచల్ ప్రదేశ్ అత్యవసర విపత్తు నిర్వహణ కేంద్రం తెలిపిన వివరాలు ప్రకారం జులై 31 ఉదయం 10గంటలకు నాటికి మొత్తం 301 రహదారులు ఇప్పటికే బ్లాక్ చేశారు. 436 విద్యుత్ పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయి. 254 నీటి సరఫరా పథకాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఇక జూన్ 20న మొదలైన వర్షాల కారణంగా 170మంది మరణించారు. కొండచరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలు, క్లౌడ్‌బరస్ట్, విద్యుదాఘాతం వంటి ఘటనల కారణంగా 94 మంది మరణించారు. రోడ్డు ప్రమాదాల్లో 76 మంది మృతి చెందినట్లు రాష్ట్ర విపత్తు కేంద్రం తెలిపింది. వర్షాల కారణంగా 400కు పైగా ఇళ్లు, 1,627 గోశాలలు, రోడ్లు, విద్యుత్ లైన్లు, నీటి వ్యవస్థలతోసహా ప్రభుత్వ ఆస్తులు గణనీయంగా దెబ్బతిన్నాయి. 2,743 హెక్టార్ల పంటలు నాశనమయ్యాయి. 680 ఇళ్లు ధ్వంసమయ్యాయి. 22,900 పశువులు మృతి చెందినట్లు రాష్ట్ర విపత్తు కేంద్రం పేర్కొంది. అలాగే కొండచరియలు విరిగిపడటం, వరదలకు గురయ్యే ప్రాంతాల్లో అవసరమైతే తప్ప ప్రయాణాలు చేయొద్దని రాష్ట్ర విపత్తు కేంద్రం సూచించింది. ప్రస్తుతం పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయని, వర్షాల కారణంగా సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోందని సూచించిందిపేర్కొంది. ఇక రాజస్థాన్‌లో వచ్చే 48 గంటల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ముఖ్యంగా అజ్మీర్, జయ్‌పూర్, బీకనేర్, జోధ్‌పూర్ ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కోటా, ఉదయపుర్, భరత్‌పుర్ ప్రాంతాల్లోని కొన్ని చోట్ల మోస్తరునుంచి భారీవర్షం కురవొచ్చని తెలిపింది. ఆగస్టు 1న భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆగస్టు 2 నుంచి తేలిపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని అంచనా వేసింది. రానున్న 24గంటల్లో తూర్పు రాజస్థాన్‌లోని కొన్ని ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉందని సూచించి. రాజస్థాన్‌లోని ఆరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, 12 జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను ప్రటించింది. దీంతో పాఠశాలలకు సెలవులు ప్రకటించారు అధికారులు. కొన్ని ప్రాంతాల్లో ఆగస్టు 2వరకు సెలవులు ప్రకటించారు. రాజస్థాన్‌లో జూన్ 15 నుంచి ఇప్పటి వరకు 80మంది మరణించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. గడచిన కొన్ని రోజులగా దేశరాజధాని దిల్లీలో కూడా వర్షాలు కురుస్తున్నాయి. అయితే గురువారం కూడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. కొన్ని ప్రాంతాల్లో ఈదురుగాలులు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. రోజంతా తేలికపాటి జల్లులతో ఉంటుందని అంచనా వేసింది.



### ట్రంప్ నిజం చెప్పినా

# తీరుమారని మోడీ

### లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ, ఆగస్టు1 :** భారత ఆర్థిక వ్యవస్థ డెడ్ ఎకానమీగా మారిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌చేసిన వ్యాఖ్యలపై లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ స్పందించారు. భారత్ డెడ్ ఎకానమీ అని ప్రపంచంలో ప్రతి ఒక్కరికి తెలిసిపోయిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి మినహా ప్రతి ఒక్కరికి ఈ విషయం తెలుసని ఎద్దేవా చేశారు. కేవలం ఒక అదానీకి సాయం చేసేందుకు భారత ఆర్థిక వ్యవస్థను నాశనం చేసిందని బిజెపిపై మండిపడ్డారు. భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం కుదిరితే ట్రంప్ చెప్పినట్లే మోడీ చేస్తారు. మన ఆర్థిక, రక్షణ, విదేశాంగ విధానాన్ని ప్రభుత్వం పూర్తిగా ధ్వంసంచేస్తుంది. దేశాన్ని పూర్తిగా నాశనం చేస్తున్నారు. నేనే కాల్పుల విరమణ చేశానని ట్రంప్ దాదాపు ముప్పయి 32 సార్లు చెప్పారు. దీంతో పాటు 5 ఇండియన్ జెట్లు కూడా కూలాయని అన్నారు. ఇప్పుడు వచ్చి ఏకంగా 25శాతం సుంకాలు వేస్తున్నానని ప్రకటించారు. వీటన్నింటికి ప్రధాని మోడీ సమాధానం చెప్పలేకపోతున్నారు, ఎవరి చెప్పుచేతల్లో ఆయన ఉన్నట్లని విపక్ష నేత రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు. విదేశాంగ మంత్రి పార్లమెంట్‌లో మాట్లాడుతూ మనకు అద్భుతమైన విదేశాంగ విధానం ఉందని చెప్పారు. ఒకవైపు అమెరికా దూషిస్తుంది. మరోవైపు చైనా మనవెనుకపడుతుంది. మీరు ప్రపంచ వ్యాప్తంగా అఖిలపక్ష బృందాలను పంపినా ఒక్క దేశం కూడా పాకిస్థాన్ వైఖరిని ఖండించలేదు. ప్రధాని మెడీ తన ప్రసంగంలో ఎక్కడా ట్రంప్, చైనా పేరు ఎత్తలేదు. పహాల్గాం ఉగ్రదాడికి కారణమైన పాకిస్థాన్ ఆర్మీ చీఫ్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో కలిసి భోజనం చేసి భారీ విజయాన్ని సాధించామని అంటున్నారని రాహుల్ మండిపడ్డారు.

## భారత్-రష్యా బంధం.. 'ఐ డోంట్ కేర్'

### డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు

**వాషింగ్టన్, ఆగస్టు1 :** భారత దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 25 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేయడమే అందుకు కారణమని కూడా తెలిపారు. తాజాగా రష్యా, భారత్‌లను ఉద్దేశిస్తూ ఆయన మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం ట్రూత్ సోషల్‌లో ఆయన ఓ పోస్టు పెట్టారు. రష్యాతో భారత్ ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకున్నా తనకు సంబంధం లేదన్నారు. వారి ఆర్థిక వ్యవస్థను మరింత పతనం చేసుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. న్యూఢిల్లీతో చాలా తక్కువ వ్యాపారం చేస్తున్నామన్నారు. ఎందుకంటే భారత్ అత్యధికంగా సుంకాలు విధిస్తుందని ఆరోపించారు. ఈ సందర్భంగా రష్యా, యుఎస్‌లు కలిసి ఎలాంటి వ్యాపారం చేయట్లేదని ట్రంప్ స్పష్టం చేశారు. తర్వాత ఆ దేశ మాజీ అధ్యక్షుడు దిమిత్రి మద్వెదేవ్‌పై విరుచుకుపడ్డారు. తమతో వాషింగ్టన్ గేమ్ ఆడుతుందని, అది యుద్ధానికి దారి తీయొచ్చని దిమిత్రి హెచ్చరించడంపై ట్రంప్ స్పందిస్తూ.. ఆయన ఇంకా అధ్యక్షుడిననే అనుకుంటున్నారని విమర్శించారు. ఆయనప్రమాదకరంగా ప్రవర్తిస్తున్నారని హెచ్చరించారు.



రష్యాతో వ్యాపారాన్ని కొనసాగిస్తే భారీగా సుంకాలు విధిస్తాయని భారత్‌తోపాటు పలు దేశాలను ఇటీవల పలుమార్లు అమెరికా హెచ్చరిస్తూ వచ్చింది. ఈ క్రమంలో ఇదే కారణాన్ని చూపుతూ.. భారత దిగుమతులపై 25 శాతం సుంకంతోపాటు, పెనాల్టీలుకూడా విధించారు. ప్రపంచంలో అత్యధిక సుంకాలు విధించే దేశాల్లో న్యూఢిల్లీ ఒకటని ఆరోపించారు. ఆగస్టు 1నుంచి ఈనిర్ణయం అమలులోకి వస్తుందన్నారు. రష్యా నుంచి దిగుమతుల కారణంగా యుఎస్ పెనాల్టీలకు గురైన తొలి దేశం భారత్. ఈ సుంకాలపై భారత్ స్పందిస్తూ.. జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొంది.



## బిజెపితో ఒపిఎస్ తెగతెంపులు

### స్టాలిన్‌తో మార్నింగ్‌వాక్ .. వెనువెంటనే తన నిర్ణయం వెల్లడి

**చెన్నై, ఆగస్టు1 :** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి, అన్నాడిఎంకే బహిష్కృత నేత ఓపిఎస్‌గా పిలుచుకునే ఓ పన్నీర్ సెల్వం ఎన్డీయేతో తెగదెంపులు చేసుకున్నట్టు గురువారం ప్రకటించారు. గతేడాది పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఒపిఎస్ బిజెపి నాయకత్వంలోని ఎన్డీయే కూటమిలో చేరిన విషయం తెలిసిందే. అయితే, తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకే అధినేత ఎంకే స్టాలిన్‌తో మార్నింగ్ వాక్ సందర్భంగా సమావేశమైన కొద్ది గంటల్లోనే పన్నీర్ సెల్వం ఈ ప్రకటన చేయడం గమనార్హం. అదే సమయంలో, వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్‌లో తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న దృష్ట్యా ఈ పరిణామం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. గత కొద్దిరోజుల నుంచి కేంద్ర ప్రభుత్వంపై పన్నీర్‌సెల్వం తీవ్రమైన విమర్శలు చేస్తున్నారు. ముఖ్యంగా తమిళనాడుకు 'సమగ్ర శిక్షాభియాన్' నిధులను విడుదల చేయకపోవడంపై ఆయన మండి పడ్డారు. విద్యార్థులు, ఉపాధ్యాయులపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుందని ఒపిఎస్ ఆగ్రహంవ్యక్తం చేశారు. కాగా, 2022లోనే అన్నా డిఎంకే నుంచి పన్నీర్ సెల్వంను బహిష్కరించిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జరగబోయే తమిళనాడు ఎన్నికల్లో అధికార డిఎంకే, నటుడు విజయం కొత్త పార్టీ టివికే, బిజెపి అన్నాడిఎంకే కూటమిమధ్య త్రిముఖ పోరు తప్పదని భావిస్తున్నారు. గతేడాది లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీ పెట్టిన విజయ్‌కు ఇవే తొలి ఎన్నికలు.

## ఐర్లాండ్‌లో మరో జాత్యహంకార దాడి

**డబ్లిన్, ఆగస్టు1 :** ఐర్లాండ్‌లో జాత్యహంకార దాడి ఘటన చోటుచేసుకుంది. డబ్లిన్‌లో భారత్‌కు చెందిన ఓ వ్యక్తిపై అక్కడి కొందరు యువకులు దాడికి పాల్పడ్డారు. సంతోశ్ యాదవ్ అనే వ్యక్తి లెట్టర్‌కెన్ని సిటీలో ఉన్న విసార్ ల్యాబ్ అండ్ టెక్నాలజీ కంపెనీలో సీనియర్ డేటా అనలిస్టుగా పనిచేస్తున్నాడు. తనపై జరిగిన దాడిగురించి ఆయన తన లింక్డిన్ ప్రొఫైల్‌లో పోస్టు చేశారు. తల, ముఖం, మెడ, ఛాతి, చేతులు, కాళ్లపై యువకులు దాడి చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాల్లో ఈ ఘటనపై ఆయన సుదీర్ఘమైన పోస్టు చేశారు. భారతీయ సంతతి వ్యక్తులపై ఐర్లాండ్‌లో దాడులు పెరుగుతున్నట్లు అతను పేర్కొన్నారు.

డిన్నర్ చేసిన తర్వాత తన అపార్ట్‌మెంట్ వద్ద వాకింగ్ చేస్తున్న సమయంలో ఆరుగురు వ్యక్తులు అటాక్ చేసినట్లు సంతోశ్ యాదవ్ తెలిపారు. తన కంటి అద్దాలను తీసివేసి.. నిర్దాక్షిణ్యంగా తల, మెడపై దాడి చేశారన్నారు. రోడ్డుపైనే రక్తం కారుతున్న దశలో తనను వదిలేయడంతో అంబులెన్స్‌కు ఫోన్ చేశానని, వాళ్లు ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు. తన దవడ ఎముక విరిగినట్లు మెడికల్ బృందం పేర్కొన్నట్లు తన పోస్టులో తెలిపారు. కొన్ని రోజుల క్రితం ఇదే కోవలో డబ్లిన్‌లోనే ఓ భారతీయుడిపై దాడి జరిగింది. చిన్న పిల్లలతో అనుచితంగా ప్రవర్తించాడనే నెపంతో ఒక గుంపు భారత వ్యక్తిపై దాడికి పాల్పడింది. ఈ ఘటన జరిగిన వారం తర్వాత మళ్లీ ఇప్పుడు మరో జాత్యహంకార దాడి వెలుగులోకి వచ్చింది.

# పహాల్గాం ఉగ్రదాడి లష్కరే తోయిబా పనే!

### కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



**న్యూఢిల్లీ, ఆగస్టు1 :** పహల్గాం ఉగ్రదాడిలో లష్కరే తోయిబా హస్తం ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తెలిపారు. ఆపరేషన్ మహదేవ్ చేపట్టి అంతం చేసిన ముగ్గురు ఉగ్రవాదులు ఆ ఉగ్రసంస్థకు చెందినవారేనని స్పష్టం చేశారు. వాస్తవానికి పహల్గాం దాడి వెనుక ఉన్న ఉగ్రవాదుల తలపై కాల్చి చంపాలని ప్రజలు కోరుకున్నారని, యాదృచ్ఛికంగా ఆ ముగ్గురు ఉగ్రవాదులను మన బలగాలు తలపైనే గురిచూసి కాల్చాయని ఆయన రాజ్యసభలో చెప్పారు. మహిళలు, పిల్లల ముందు మతం అడిగి మరీ చంపేశారని, ఇంత అనాగరిక నేరం ఇంతకు ముందు ఎన్నడూ జరగలేదని అమిత్‌షా అన్నారు. కాంగ్రెస్‌కు జాతీయ భద్రత కంటే రాజకీయాలే ముఖ్యమైపోయాని అమిత్ షా విమర్శలు గుప్పించారు. ఓటు బ్యాంకు రాజకీయాలతో కాంగ్రెస్ సంతృప్తి పడుతోందని ఆయన దుయ్యబట్టారు. కాంగ్రెస్ పాక్‌ఆక్రమిత కాశ్మీర్‌లను పాకిస్థాన్‌కు ఇచ్చేసిందని, కానీ బీజేపీ దానిని తిరిగి భారత్‌లో చేరుస్తుందని అమిత్‌షా స్పష్టం చేశారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాల వల్లే ఉగ్రవాదం వృద్ధి చెందిందని ఆయన విమర్శించారు. వాస్తవానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఉండి ఉంటే, ఉగ్రవాదులపై చర్య తీసుకునే బదులు పత్రాలను పంపి ఉండేదని ఆయన ఆరోపించారు. భారత్‌లో ఉగ్రవాదం పూర్తిగా అంతరించే దిశలో ఉందని, అది కచ్చితంగా అంతం అవుతుందని అమిత్‌షా అన్నారు. హిందువులు ఎప్పటికీ ఉగ్రవాదులు కాలేరని, ఈ విషయాన్ని ప్రపంచానికి గర్వంగా ప్రకటిస్తున్నానని తెలిపారు. మరోవైపు అమిత్‌షా మాట్లాడడం ప్రారంభించగానే ప్రతిపక్ష పార్టీలు నిరసనలు వ్యక్తం చేశాయి. ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడాలని డిమాండ్ చేశాయి. కానీ సభాధ్యక్షులు విపక్షాల డిమాండ్‌ను అంగీకరించలేదు. దీంతో వారు వాకౌట్‌చేశారు. అమిత్‌షా ప్రసంగాన్ని కొనసాగిస్తూ, కాంగ్రెస్ నేత, మాజీ కేంద్ర హోంమంత్రి చిదంబరంపై విమర్శలు గుప్పించారు. చిదంబరం నా రాజీనామా కోరారు. పహల్గాంలో దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు పాకిస్థాన్‌కు చెందినవారని రుజువు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాదు ఆపరేషన్ సిందూర్ సమర్థతను కూడా చిదంబరం సవాల్ చేశారు. అంటే కాంగ్రెస్‌కు జాతీయ భద్రత కన్నా రాజకీయాలు ముఖ్యం. అది ఓటు బ్యాంకు రాజకీయాలు, బుజ్జగింపు రాజకీయాల్లో మునిగిపోయింది. కాంగ్రెస్ మనస్తత్వాన్ని చిదంబరం ప్రపంచానికి బహిర్గతం చేశారు. ఓటు బ్యాంకు కోసం వారు పాకిస్థాన్, లష్కరే తోయిబాతో సహా ఉగ్రవాదులు అందరికీ మద్దతు ఇస్తారని అమిత్‌షా విమర్శలతో ధ్వజమెత్తారు. శివాజీ మహారాజ్ మొఘలులపై పోరాడినప్పుడు, ఆయన యుద్ధ నినాదం హరహర మహాదేవ్. వాస్తవానికి భారతీయ సైనికులు వివిధ యుద్ధ నినాదాలు మతాలపై ఆధారపడి ఉంటాయి. అయితే వాటికి హిందూ, ముస్లింలతో సంబంధంలేదు. ఉగ్రవాదులను తుదముట్టించేందుకు మన సిఆర్‌పిఎఫ్, సైన్యం, జమ్మూకశ్మీర్ పోలీసులు చాలా కృషి చేశారు. కష్టతరమైన భూభాగంలో ఉంటూ, డ్రోన్‌ల ద్వారా పంపే ఆహారాన్ని తిన్నారు. ఇలా ఉగ్రవాదులను వెంబడించి వారికి తుదముట్టించారని రాజ్యసభలో హోంమంత్రి వివరించారు.

## మాలేగాం పేలుళ్లకేసులో ఏడుగురు నిందితులు నిర్దోషులే

### ముంబయి ఎన్‌ఐఎ కోర్టు తీర్పు

**ముంబయి, ఆగస్టు1 :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసులో ముంబయిలోని ఎన్ఐఎ కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడుగురు నిందితులను నిర్దోషులుగా తేల్చింది. మాజీ ఎంపీ సాధ్వి ప్రజ్ఞా సింగ్ సహా మిగిలిన నిందితులు నేరం చేశారని చెప్పేందుకు ఎలాంటి ఆధారాలు లేవని వెల్లడించింది. మాలేగావ్‌లో బైకులోనే బాంబు పెట్టినట్లు ఎన్ఐఎ నిరూపించలేక పోయిందని కోర్టు పేర్కొంది.

మాజీ సాధ్వి ప్రజ్ఞాసింగ్‌కు సొంత బైకు ఉన్నట్లు ఆధారాల్లేవని న్యాయస్థానం పేర్కొంది. మరో నిందితుడు కర్నల్ ప్రసాద్ పురోహిత్ ఇంట్లో ఆర్డీఎక్స్ ఉన్నట్లు ఆధారాల్లే వని వివరించింది. ఘటనాస్థలం నుంచి వేలి ముద్రలు, డిఎన్ఎ నమూనాలను సేకరించలేదని తెలిపింది. నిందితుల మధ్య సమావేశాలు జరిగినట్లు, కుట్ర పన్నినట్లు దర్యాప్తు సంస్థ నిరూపించలేక పోయిందని పేర్కొంది. ఈ కేసులో తీవ్రవాద నిరోధక చట్టం చేర్చడానికి వీల్లేదని, అది చెల్లదని తీర్పులో స్పష్టంచేసింది. 2008 సెప్టెంబర్ 29న మాలేగావ్‌లో మసీదు వద్ద పార్క్ చేసిన బైకులో బాంబు పేలి ఆరుగురు దుర్మరణం చెందారు. 100 మందికిపైగా గాయ పడ్డారు. ఈ కేసులో బిజెపి నాయకురాలు, మాజీ ఎంపీ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్, లెఫ్టినెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్, రిటైర్డ్ మేజర్ రమేష్ ఉపాధ్యాయ, అజయ్ రాహిర్కర్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణి నిందితులుగాఉన్నారు.

17 సంవత్సరాల తర్వాత ఈ కేసులో తీర్పు వెలువరించిన ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు నిందితులు అందరినీ నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో 2018లో ప్రారంభమైనవిచారణ 2025 ఏప్రిల్ 19న ముగియగా, ఆ రోజే తీర్పును రిజర్వుచేసిన న్యాయస్థానం గురువారం వెలువరించింది.

ఈ కేసును దర్యాప్తు చేసిన ఎన్ఐఎ, నిందితులకు తగినశిక్ష విధించాలని వాదించింది. ముస్లిం జనాభా గణనీయంగాఉన్న మాలేగావ్‌లో ఈ పేలుడు ద్వారా ముస్లిం సమాజంలోని ఒక వర్గాన్ని భయభ్రాంతులకు గురిచేయడానికి ప్రయత్నించారని ఎన్ఐఏ ఆరోపించింది. మతపరమైన ఇందుకు కచ్చితమైనా, నిరూపించదగిన ఆధారాలు ఉన్నట్లు ఎన్ఐఎ వాదించింది. నిందితులు కుట్రలో నేరుగా పాల్గొన్నారని తెలిపింది. రంజాన్ మాసంలో, నవరాత్రికి ముందు పేలుడు జరపడం ద్వారా ముస్లిం సమాజంలోని మతకలహాల భయం సృష్టించాలనే ఉద్దేశంతోనే నిందితులు ఈ చర్యకు పాల్పడినట్లు ఎన్ఐఎ తెలిపింది.



# చైనాలో మెరుపు వరదలు



## కొట్టుకుపోయిన రూ. 12 కోట్ల బంగారం

## వెతుకులాటకు వీధుల్లో ఎగబడిన స్థానిక జనం!

**బీజింగ్, ఆగస్టు1 :** చైనాలో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో చాలాచోట్ల మెరుపు వరదలు సంభవించాయి. షాంగ్జీ ప్రావిన్స్‌లో వరదల కారణంగా ఓ నగల దుకాణంలో నుంచి బంగారం, వెండి ఆభరణాలు కొట్టుకుపోయాయి. దీంతో వాటిని వెతికేందుకు వీధుల్లో స్థానికులు పోటీ పడ్డారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. షాంగ్జీ ప్రావిన్స్‌లోని వుచి కౌంటీలో జూలై 25న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ప్రాంతం సముద్ర తీరానికి సమీపంలో ఉంటుంది. ఇక్కడ స్థానికంగా ఉన్న లావోఫెంగ్జియాంగ్ ఆభరణాల దుకాణాన్ని ఎప్పటిలాగే ఉదయం సిబ్బంది తెరిచారు. అప్పటికే భారీ వర్షాలతో ఆ ప్రాంతమంతా జలమయమైంది. చూస్తుండగానే వరద నీరు దుకాణంలోకి చొచ్చుకువచ్చింది. వరద ఉధృతి పెరగడంతో కళ్లముందే దుకాణంలోని నగలు, సేఫ్ బాక్స్ కొట్టుకుపోయాయి.

అయితే ఆ వరదల్లో కొట్టుకుపోయిన వాటిల్లో బంగారు హారాలు, గాజులు, ఉంగరాలు, చెవి దుద్దులు, వజ్రపు ఉంగరాలు, వెండి ఆభరణాలు ఉన్నట్లు దుకాణ యజమాని తెలిపారు. సేఫ్ బాక్సులో రీసైకిల్ చేసిన బంగారంతోపాటు భారీగా నగదు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. దాదాపు 20 కిలోల బంగారం, నగదు గల్లంతైనట్లు తెలిపారు. వీటి విలువ 10 మిలియన్ యువాన్లు (అంటే భారత కరెన్సీలో దాదాపు రూ. 12 కోట్ల పైమాటే) ఉంటుందని వెల్లడించారు.

బంగారం కొట్టుకుపోయిన విషయం తెలియగానే స్థానికులు పెద్దఎత్తున వీధుల్లోకి చేరి బంగారం కోసం వెతకడం ప్రారంభించారు. కొందరు స్వచ్ఛందంగా తమకు దొరికిన ఆభరణాలను వెనక్కి ఇచ్చేశారని దుకాణ యజమాని తెలిపారు. ఇప్పటివరకు కిలో బంగారం తమ వద్దకు చేరిందన్నారు. రోజులు గడుస్తున్నా మిగతా బంగారం కోసం స్థానికులు వెతుకుతూనే ఉన్నారు. ఇందుకు సంబంధించిన విడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

# సంక్షిప్తంగా..

## డెల్టా విమానంలో కుదుపులు.. అత్యవసర ల్యాండింగ్

**వాషింగ్టన్, ఆగస్టు1 :** డెల్టా ఎయిర్‌లైన్‌కు చెందిన విమానం కుదుపులకు లోనైంది. దీంతో ఈ విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. అసలేం జరిగిదంటే.. బుధవారం డెల్టా ఎయిర్‌లైన్స్‌కు చెందిన డిఎల్56 విమానం సాల్ట్ లేక్ సిటీ నుంచి ఆమ్‌స్టర్‌డామ్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో విమానం ఒక్కసారిగా కుదుపులకు లోనైంది. దీంతో విమానాన్ని మినియాపొలిస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించి సురక్షితంగా ల్యాండ్ చేశారు. ఈ ఘటనలో 25 మందికిపైగా ప్రయాణికులకు గాయాలైనట్లు తెలుస్తోంది. దీంతో వెంటనే వైద్య సిబ్బంది క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి.. చికిత్స అందించారు. ఈ ఘటన సమయంలో విమానంలో 275 మంది ప్రయాణికులు, 13 మంది సిబ్బంది ఉన్నట్లు తెలుస్తోంది. డెల్టా ఎయిర్‌లైన్స్ కూడా దీన్ని ధ్రువీకరించింది. అయితే ఈ కుదుపులకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారని తెలిపింది.

## అండమాన్, నికోబార్‌లోని పోర్ట్‌బ్లెయిర్‌లో ఇడి దాడులు!

**న్యూఢిల్లీ, ఆగస్టు1 :** ఓ మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అండమాన్ నికోబార్ దీవుల్లో సోదాలు నిర్వహించారు. ఈ దీవుల్లో ఇడి తనిఖీలు చేపట్టడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఓ సహకారబ్యాంకు రుణాల వ్యవహారంలో అవకతవకలకు పాల్పడినట్లు స్థానిక కాంగ్రెస్ మాజీ ఎంపి కుల్దీప్‌రాయ్‌శర్మ తదితరులపై ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు సంబంధించిన మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఇడి అధికారులు పోర్ట్‌బ్లెయిర్ పరిసరాల్లోని తొమ్మిది ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. కోల్‌కతాలోనూ తనిఖీలు కొనసాగాయి. అండమాన్ నికోబార్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంకు ద్వారా రుణాలు, ఓవర్‌డ్రాఫ్ట్ మంజూరులో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు 15 షెల్ సంస్థలు సృష్టించి బ్యాంకు నుంచి రూ.200 కోట్లకుపైగా రుణాలను మోసపూరితంగా తీసుకున్నారని అధికారులు వెల్లడించారు.

## రూ. 800 కోట్ల భూమి కబ్జా: కర్ణాటక లోకాయుక్తకు ఫిర్యాదు

**బెంగళూరు, ఆగస్టు1 :** కర్ణాటక రాజధాని బెంగళూరులో రూ. 800 కోట్ల విలువైన 108 ఎకరాల భూమిని కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్‌సి బాలకృష్ణ కబ్జా చేశారని బిజెపి నేత ఎన్ఆర్ రమేశ్ లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణ సన్నిహితుడు యశ్వంత్‌పూర్ ఎమ్మెల్యే ఎస్‌టి సోమశేఖర్, పలువురు ప్రభుత్వ అధికారులకు ఈ కబ్జాలో హస్తం ఉందని రమేశ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. రమేశ్ లోకాయుక్తకు చేసిన ఫిర్యాదు ప్రకారం.. బెంగళూరు సౌత్ తాలూకాలోని తవరకెరె హోబ్లిలోని సర్వే నంబర్లు 233, 234, 235, 236లలో గల 108 ఎకరాల భూమి కబ్జాకు గురైంది. అందులో రూ. 165 కోట్ల విలువ చేసే 26 ఎకరాల భూమిలో ఇప్పటికే నిర్మాణాలు కూడా పూర్తయ్యాయి. కెంగెరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఈ యేడాది ఏప్రిల్ 3న ఈ రిజిస్ట్రేషన్ జరిగింది. యశ్వంత్‌పూర్ నియోజకవర్గం కురుబరహల్లి గ్రామంలోని 158 సర్వే నంబర్‌లో మరికొంత భూమి కబ్జాకు గురైంది. మొత్తం 130.29 ఎకరాల ఈ భూమి విలువ రూ. 800 కోట్లు ఉంటుంది. అంటే అక్కడ ఒక్కో ఎకరా రూ. 6 కోట్ల చొప్పున పలుకుతోంది.

## చీటింగ్‌కేసులో తమిళనటుడు అరెస్టు!



**చెన్నై, ఆగస్టు1 :** తమిళ నటుడు ఎస్. శ్రీనివాసన్‌ను ఒక భారీ మోసం కేసులో ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.1000 కోట్ల లోన్ ఇప్పిస్తానని చెప్పి ఒక సంస్థ నుంచి రూ. 5 కోట్లు తీసుకుని మోసం చేసినట్లు ఆరోపణలు రావడంతో అతడిని బుధవారం ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 2010లో ఓ సంస్థకు రూ.1000 కోట్లు రుణం ఇప్పిస్తానని శ్రీనివాసన్ హామీ ఇచ్చారు. దీనికి బదులుగా వారి వద్ద నుంచి రూ.5 కోట్లు అడ్వాన్స్‌గా తీసుకున్నారు. నెల రోజుల్లో లోన్ వస్తుందని రాకపోతే డబ్బులు తిరిగి ఇస్తానని హామీ ఇచ్చారు. అడ్వాన్స్‌గా తీసుకున్న డబ్బును వ్యక్తిగత అవసరాల కోసంతో పాటు సినిమాల నిర్మాణానికి ఉపయోగించినట్లు సమాచారం. అయితే, నెలలు గడిచినా రుణం మంజూరు కాకపోవడంతో మోసపోయామని గుర్తించిన సంస్థ యాజమాన్యం పోలీసులను ఆశ్రయించింది. దీంతో ఢిల్లీ పోలీసులు శ్రీనివాసన్‌ను చెన్నైలో అరెస్టు చేశారు. ఇక, 2010లో కోలీవుడ్‌లోకి అడుగుపెట్టిన శ్రీనివాసన్ ఇప్పటివరకు 60కి పైగా చిత్రాల్లో నటించారు.

## గవర్నమెంట్ స్కూల్ అసిస్టెంట్‌లను ఎంఈఓ-1లుగా నియమించడంపై నిరసనలు



○ పీఆర్టీయూ - ఏపీయూఎస్ సంయుక్తంగా నల్ల బ్యాడ్జిలతో నిరసన

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ఎంఈఓ-1లుగా కేవలం గవర్నమెంట్ మేనేజ్మెంట్ స్కూల్ అసిస్టెంట్‌లను మాత్రమే నియమించడాన్ని నిరసిస్తూ పీఆర్టీయూ మరియు ఏపీయూఎస్ సంఘాలు శుక్రవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశాయి. ఈ కార్యక్రమం ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కుదప లో నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు కోసూరి రాజశేఖర్, జిల్లా కార్యదర్శి తాళ్లూరి శ్రీనివాసరావు, అలాగే మండలంలోని ఉన్నత పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ , "జిల్లాపరిషత్ మరియు గవర్నమెంట్ మేనేజ్మెంట్లకు ఉమ్మడి సర్వీసు రూల్స్ ఉండగా, కేవలం ఒక మేనేజ్మెంట్ ఉపాధ్యాయులను మాత్రమే ఎంఈఓ-1లుగా నియమించడం అన్యాయం" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి సీనియారిటీ ఆధారంగా ఎంపిక జరగాలని, దానివల్లే సమాన న్యాయం జరిగే అవకాశముంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం తక్షణమే ఈ వివక్షను సరిదిద్దకపోతే, అన్ని ఉపాధ్యాయ సంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర స్థాయిలో ఉద్యమ కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో రెడ్డిగూడెం మండల శాఖ, ఎన్టీఆర్ జిల్లా శాఖలకు చెందిన పలువురు ఉపాధ్యాయ నాయకులు పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన రాజధాని రైతు కూలీ పెన్షన్లను కూటమి ప్రభుత్వం మంజూరు చేసింది



○ ఈ ఘనత మంత్రి నారా లోకేష్ కె దక్కుతుంది

○ కృష్ణయపాలెం గ్రామ టిడిపి అధ్యక్షులు ఆవల రవి కిరణ్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** గత వైసిపి ప్రభుత్వం రాజధాని రైతు కూలీ పెన్షన్లను నిలిపివేసిందని ఆ పెన్షన్లను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంజూరు చేసిందని కృష్ణాయ పాలెం గ్రామ టిడిపి అధ్యక్షులు ఆవల రవి కిరణ్ అన్నారు. రాజధాని ప్రాంత రైతు కూలీలకు పెన్షన్లు మంజూరైన నేపథ్యంలో ఆయన హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం కృష్ణయపాలెం గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు అనంతరం ఆవల రవి కిరణ్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాజధాని ప్రాంతం పై అక్కస్సుతో రైతు కూలీల పెన్షన్లను నిలిపివేసిందని ఆయన విమర్శించారు. దీనిపైరైతు కూలీలు ఆగ్రహం వ్యక్తం చేశారని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లను యధావిధిగా కొనసాగిస్తామని అప్పట్లో ఇచ్చిన మాటకు కట్టుబడి పెన్షన్లను మంజూరు చేయటం జరిగిందని ఆయన తెలిపారు. తాజాగా రైతు కూలీలకు పెన్షన్లు మంజూరు పై రైతు కూలీలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ లకు కృతజ్ఞతలు తెలుపుతున్నారని కొనియాడారు. అమరావతిని కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని అభివృద్ధి చేస్తుందని ఆవల రవికిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఈపూరి పెద్దబ్బాయి, మంగళగిరి నియోజకవర్గ మహిళా ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, మంగళగిరి మండలం రైతు ప్రధాన కార్యదర్శి తోట సాంబయ్య, మంగళగిరి మండల తెలుగు యువత అధ్యక్షులు ఈపూరి జయకృష్ణ, ఈపూరి రాజు,ఈపూరి బెనర్జి,కట్టేపోగు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా సభ్యత్వానికి రాజీనామా చేసిన బి .మఠం ఎంపీపీ



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్) :** బ్రహ్మంగారిమఠం మండల ప్రజా పరిషత్ చైర్మన్ చిలేకాంపల్లె వీరనారాయణరెడ్డి శుక్రవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయడం జరిగింది. తన వ్యక్తిగత కారణాల వలన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ఆయన పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్మోహన్ రెడ్డికి అలాగే జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డికి రాజీనామా లేఖను పంపడం జరిగింది. వైఎస్ఆర్సిపి క్రమశిక్షణ సంఘం చైర్మన్ మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి కి కూడా రాజీనామా ప్రతిని పంపినట్లు ఆయన తెలియజేశారు. వీరనారాయణరెడ్డి వారి కుటుంబ సభ్యులు గురువారం సాయంత్రం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ను మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించిన విషయం తెలిసిందే.

## ఆస్తులకు ఆటో మ్యూటేషన్ అమలు



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** రిజిస్ట్రేషన్ సమయంలోనే ఆస్తులకు ఆటో మ్యూటేషన్ అమలుతో ప్రజలకు సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం నల్లపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆటో మ్యూటేషన్ అమలు ప్రక్రియను జిల్లా రిజిస్ట్రార్ డి. శైలజ, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 17 కార్పొరేషన్లలో ఆస్తులకు ఆటో మ్యూటేషన్ విధానాన్ని ప్రారంభించిందన్నారు. మున్సిపల్ ఈఆర్పీలోని వివరాలు, రిజిస్ట్రేషన్ శాఖ వివరాలు తేలికగా సరిపోతే వెంటనే మ్యూటేషన్ జరుగుతుందన్నారు. అయితే, డాక్యుమెంట్‌లో నూతన డోర్ నంబర్ ఉన్నపుడు కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశముందని, వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లతామని తెలిపారు. తొలి దశలో ప్రక్రియ కొంత నెమ్మదిగా సాగినా, వారం రోజుల్లో వేగం అందుకుంటుందని తెలిపారు. ఇకపై మ్యూటేషన్ కోసం జీఎంసీని ఆశ్రయించాల్సిన అవసరం ఉండదని, దీనివల్ల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఇక పన్నుల విధింపులో పారదర్శకత పెరిగి, ఎవరూ తప్పించుకోలేని విధంగా మారుతుందన్నారు. ఈ విధానం జీఎంసీకి కూడా ఉపయోగకరంగా మారుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నల్లపాడు సబ్ రిజిస్ట్రార్ గోపాల్ పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం

○ 52వ డివిజన్ లో పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ లో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలన్నదే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. శుక్రవారం 52వ డివిజన్ చంద్రయ్య నగర్ లో సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి పాల్గొని, లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి పంపిణీ చేసి, వారితో ముచ్చటించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పెన్షన్ల పెంపుతో తమకు జీవితానికి భరోసా ఇచ్చినట్లు ఉన్నదని వృద్ధులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా స్పౌజ్ పెన్షన్లను మంజూరు చేయడం జరిగింది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో భర్త చనిపోయిన 4 సంవత్సరాలు అయినా కూడా భార్యకు పెన్షన్ ఇవ్వలేని పరిస్థితి మనం చూశాము. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వీటి మీద దృష్టి పెట్టి, భర్త చనిపోయిన భార్యకు, అదే నెల నుండి భార్యకు పెన్షన్ అందేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఈ కొత్త వితంతు పెన్షన్ 343 మంది లబ్ధిదారులు ఉన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోనే 9 కోట్ల రూపాయల డబ్బుతో ఈరోజు పెన్షన్ పంపిణీలు చేసాము. ఈ పెన్షన్లు, లేదంటే సంక్షేమ పథకాలు కేవలం అర్హులైన వాళ్ళకే అందాలి, సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో తాను ఇంటింటికి వెళ్ళినప్పుడు 4అంతస్తుల బిల్డింగ్ ఉన్న వారికి పెన్షన్ అందుతుంది అని ఫిర్యాదు చేశారు. దీని వలన నిజమైన లబ్ధిదారులు సంక్షేమ పథకాలకు అర్హత సాధించలేక పోతున్నారన్నారు. ఎన్డీయే కూటమి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు తీసుకెళ్తున్నదని అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళుగా ముందుకెళ్తున్నదని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశీలకులు సింహాద్రి కనకాచారి, కార్పొరేటర్ శ్రీ వల్లి, రావెళ్ల వెంకటయ్య, మునగా గణపతి, నూకలమ్మ, కిట్టు, గోపి,మట్టు లక్ష్మయ్య,రామినేని రవి,మైనం లక్ష్మీ నారాయణ, మువ్వా వేణు, గుజ్జం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# "గిరిజన సంక్షేమమే లక్ష్యం - ఎన్డీఏ ప్రభుత్వ అడుగులు"

○ మాచర్ల గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి ప్రతిధ్వని



**మాచర్ల (జర్నలిస్ట్ ఫైల్) :** పల్నాడు జిల్లాలోని మాచర్ల మండల గిరిజన ప్రాంతాల్లో "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ క్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు కొండారెడ్డి నరహరి వరప్రసాద్ శుక్రవారం చెంచు తెగలు అధికంగా నివసించే గ్రామాలను సందర్శించారు. మాచర్ల ఎస్టీ సెల్ టీడీపీ ప్రధాన కార్యదర్శి, గిరిజన సలహా మండలి సభ్యులు రావుల కొండలు సమన్వయంతో జరిగిన ఈ పర్యటన గిరిజన గ్రామాల్లోని సమస్యలను తెలుసుకోవడంలో విశేష ప్రాధాన్యత సంతరించుకుంది.

పెద్ద అనుపు చెంచు కాలనీ, బెల్లంకొండవారి చెంచు కాలనీలలో పర్యటించిన నరహరి వరప్రసాద్ గిరిజనులతో సమావేశమై వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. గత వైసీపీ పాలనలో గిరిజనులు ఎదుర్కొన్న కష్టాలను గుర్తుచేస్తూ, ఆ సమయంలో ప్రతి గ్రామంలోనూ నిరాశ, ఆర్తనాదాలే వినిపించేవని ఆయన అన్నారు. కానీ నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన గ్రామాల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని, సంక్షేమం పట్ల కొత్త విశ్వాసం పెరుగుతోందని అభిప్రాయపడ్డారు.

ప్రత్యేకంగా యువనేత నారా లోకేష్ గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని నరహరి వరప్రసాద్ ప్రశంసించారు. రహదారుల అభివృద్ధి, విద్యాసంస్థల స్థాపన, నాణ్యమైన విద్యావనరుల అందుబాటుకు లోకేష్ చూపుతున్న శ్రద్ధ అభివృద్ధి పథానికి దోహదం చేస్తోందని తెలిపారు. అదేవిధంగా గిరిజనుల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు సీఎం చంద్రబాబు, లోకేష్ తీసుకుంటున్న నిర్ణయాలు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ గిరిజన నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. పర్యటనలో గిరిజనుల సమస్యలను ప్రత్యక్షంగా విని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం ఈ కార్యక్రమం ప్రత్యేకతగా నిలిచింది. సుపరిపాలన ఫలితాలు గిరిజన గ్రామాల్లో ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయని, ఈ అభివృద్ధి ప్రయాణం గిరిజనుల జీవితాల్లో శాశ్వత మార్పులు తీసుకువస్తుందని విశ్వాసం వ్యక్తమైంది.

# పేదల కళ్ళల్లో ఆనందం చూసేందుకే పెన్షన్ల పంపిణీ

○ మంత్రి నారా లోకేష్ సూచనలతో సకాలంలో పెన్షన్లు మంజూరు

○ మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్

○ మంజూరైన కొత్త పింఛన్లు అందజేత



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** కూటమీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సమ ప్రాధాన్యత ఇస్తున్నారని మంగళగిరి వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్ చందు అన్నారు. పెదవడ్లపూడి గ్రామంలో శుక్రవారం నూతనంగా మంజూరైన 23 మందికి పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ లకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్య అతిథిగా హాజరై పెన్షన్లను పంపిణీ చేసిన కిరణ్ చంద్ మాట్లాడుతూ, పేదలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్ లు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్లో ప్రస్తుతం 4,000, 6,000, 10,000, 15,000 పెన్షన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశనని, కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలోనే ఈ తరహా పెన్షన్ పంపిణీ జరుగుతోందని అన్నారు. సంవత్సరానికి 34,000 కోట్లు పెన్షన్ల కోసం పంచుతున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశని తెలిపారు. భర్త చనిపోయిన మహిళలకు 1,09,000 స్పౌజ్ పెన్షన్లు ఇస్తున్నామని, గతంలో 18 నుంచి 24 సంవత్సరాల మధ్య భర్త చనిపోయిన వారిని ప్రభుత్వం పట్టించుకోలేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమస్యలను పరిష్కరించి, 1,09,000 కుటుంబా లకు కొత్తగా పెన్షన్లు అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 64 లక్షల కుటుంబాలకు పెన్షన్లు పంపిణీ చేస్తున్నామని, 4,000, 6,000, 10,000, 15,000 ఇంటికి చేరడంతో లబ్ధిదారుల కళ్ళలో ఆనందం కనిపిస్తోందని అన్నారు. ముఖ్య మంత్రి నారా లోకేష్ కృషి వల్లే తమకు పెన్షన్లు అందుతున్నా యని, తమ జీవితాల్లో కష్టాలు పోయి సంతోషంగా ఉన్నామని ప్రజలు చెబుతున్నారని వివరిం చారు. ఈ పెన్షన్ల వల్ల వృద్ధులు, వికలాంగులకు గౌరవం పెరిగిందని, ఎవరి మీదా ఆధారపడకుండా జీవనం సాగించే అవకాశం కలిగిందని తెలిపారు. సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఒకటో తేదీన పెన్షన్ నగదును పంపిణీ చేస్తున్నారని పేర్కొన్నారు. వారి కళ్ళల్లో ఆనందాన్ని నింపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదల రమేష్ బాబు, చంద్రశేఖర్, యామినేని సుధాకర్, కతారి సాంబయ్య, మొద్దుకూరి రమేష్ బాబు,జాలాది సందీప్, షేక్ బాజీ, చింతల ఏడుకొండలు,ఉల్లంగి శ్రీనివాసరావు, పావులూరి కోటేశ్వరరావు, పట్రా శ్రీనివాసరావు, బొర్రా శ్రీకాంత్, గుడిమెట్ల మల్లేశ్వరరావు,కొప్పాక ఓంకార్, షేక్ బాజీవలి, రహంతుల్లా,గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు

**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు శ్రీ లినారా చంద్రబాబు నాయుడులి గారి ఆదేశాల మేరకు మైదుకూరు నియోజకవర్గ శాసనసభ్యులు లిశ్రీ పుట్టా సుధాకర్ యాదవ్‌లి ఆదేశాల మేరకు లిబి మఠంలి మండల టీడీపీ అధ్యక్షుడు లిచెన్నుపల్లి సుబ్బారెడ్డిలి గారి ఆధ్వర్యంలో మల్లేపల్లి పంచాయతీ లిచెంచయగారి పల్లెలి గ్రామంలో పింఛన్ పంపిణి కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో బూత్ నెంబర్ లి251 కన్వీనర్ చిలమల నాగయ్యలి మరియు సచివాలయ సిబ్బంది నాయకులు పాల్గొనడం జరిగింది

**వికలాంగుల సంక్షేమమే ఎన్డీఏ లక్ష్యం-మండల యువ నాయకులు. కానాల**

బ్రహ్మంగారిమఠం మండలం రేకుల కంట పంచాయతీలోని డి అగ్రహారం గ్రామంలో వికలాంగులకు మరియు వృద్ధులకు తెల్లవారుజామునే సచివాలయ సిబ్బందితో కలిసి



మండల యువ నాయకులు కానాల మల్లికార్జున్ రెడ్డి పెన్షన్ పంపిణీ చేశారు

# దళిత, బహుజన విద్యార్థుల బాధలు పాలకులకు కనిపించవా?

○ వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వినోద్

○ మంచినీరు, మరుగుదొడ్లు కూడా లేని పరిస్థితి

○ బొద్దింకల భోజనం పెడుతున్న దుస్థితి

○ కనీస సౌకర్యాలు కల్పించలేని కూటమి సర్కార్



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** సంక్షేమ హాస్టళ్లలో కనీస సౌకర్యాలు కూడా లేక నరకయాతన అనుభవిస్తున్న దళిత, బహుజన వర్గాలకు చెందిన విద్యార్థుల బాధలు కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదని వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ ఆరోపించారు. ఫలితంగా విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించలేక పోతున్నారని ఆయన విమర్శించారు.

మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ పిలుపు మేరకు గడచిన నాలుగు రోజులుగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతిగృహాలు, గురుకుల విద్యాలయాలను స్టూడెంట్స్ యూనియన్ నేతలు సందర్శించారు. ఈ సందర్భంగా వారి దృష్టికి వచ్చిన హాస్టల్ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి ఖాజాకు అందజేశారు.

ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ, మెస్ బిల్లులు, కాస్మోటిక్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని.. తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని.. శిథిలావస్థకు చేరిన హాస్టల్ మరమ్మతుల కోసం నిధులు కేటాయించాలని.. నాణ్యమైన ఆహారాన్ని అందించాలని.. క్షీణించిన పారిశుధ్యం మెరుగు పరచాలని.. ప్రతి నెలా స్థానిక ఆసుపత్రికి చెందిన వైద్య సిబ్బందితో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్ల సమస్యల అధ్యయనానికై ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి తద్వారా తక్షణమే సమస్యలు పరిష్కారం జరిగేలా చూడాలని వినోద్ కోరారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ స్టూడెంట్స్ యూనియన్ గుంటూరు నగర అధ్యక్షుడు రవీంద్ర నాయుడు, బాజీ, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షుడు అజయ్, గుంటూరు తూర్పు నియోజకవర్గ అధ్యక్షుడు సాజిద్, పొన్నూరు నియోజకవర్గ అధ్యక్షుడు గోపి, జిల్లా నాయకులు భాను, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## వాహన తనిఖీలు తరచూ ఉంటాయి... తస్మాత్ జాగ్రత్త : డిఎస్పీ బి. జనార్ధనరావు



**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) :** ద్విచక్ర వాహనదారులు నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడపడం చట్టరీత్య నేరమని తెలిసినా, అదేవిధానం మరలా కొనసాగిస్తే వాహనాలు సీజ్ చేయడంతో పాటు, పెద్ద మొత్తంలో జరిమానాలు కూడా వేయడం జరుగుతుందని తెనాలి డిఎస్పి బి జనార్దన్ రావు వాహన చోధకుల నుద్దేశించి అన్నారు

గురువారం రాత్రి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఏడు ప్రాంతాల్లో నాకాబంది, వాహన తనిఖీలు నిర్వహించిన క్రమంలో,100 ద్విచక్రవాహనాలు, 8 ఆటోలను సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం డిఎస్పీ కార్యాలయం వద్ద, వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేని వాహనం నడుపుతున్నారంటే, నెగిటివ్ ఆలోచనలతో ఉన్నారని పోలీస్ భావించడం జరుగుతుందన్నారు. వాహన ఇన్సూరెన్స్ ఉండడంవల్ల వాహనదారుడికి ప్రయోజనం అనే విషయాన్ని మరిచి, ఇన్సూరెన్స్ చేయకపోవడం సరికాదన్నారు. మైనర్ల డ్రైవింగ్ ప్రోత్సహించరాదని అన్నారు. వాహన తనిఖీలు తరచూ జరుగుతాయని, పోలీసు నిఘాలో పట్టుబడిన వాహనాలకు ఉండవలసిన అన్ని సర్టిఫికెట్లు ఉంటేనే వాహనాన్ని వదలడం జరుగుతుందన్నారు. వాహనానికి ఉండవలసిన, అన్ని సర్టిఫికెట్లను దగ్గర ఉంచుకోవాలన్నారు. ఒక వాహనంపై ముగ్గురు ప్రయాణించటం, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారి వాహనాలను తీసుకురావడం జరిగిందని, మరోసారి వాహనం పట్టుకుంటే వదిలిపెట్టడం ఉండదన్నారు. మొదటి తప్పుగా భావించి కౌన్సిలింగ్ తో వదులుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో త్రీటౌన్ సిఐఎస్ రమేష్ బాబు, ఎస్సైలు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థుల దృష్టిలోప నియంత్రణ సేవలకు రోటరీ అధిక ప్రాధాన్యం



○ రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్

**తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వపాఠశాలలో చదివే విద్యార్థులలో నూటికి నలభై శాతం మంది దృష్టికి లోపంతొ ఇబ్బంది పడుతున్నారని గుర్తించిన క్రమంలోనె రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు దృష్టిలోప పరీక్షలు నిర్వహించి, దాతల సహకారంతొ ఉచితంగా కళ్ళజోళ్ళు అందించే కార్యాచరణ అభినందనీయమని రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ పేర్కొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో స్థానిక మారీస్ పేట లోని ఎన్సీఆర్ఎం హైస్కూల్ నందు, గతంలొ దృష్టిలోపం పరీక్షలు నిర్వహించిన విద్యార్థిని విద్యార్థులకు కళ్ళజోళ్ళు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో, ఈదుల రామారావు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణచంద్ వితరణతో 117 మంది విద్యార్థులు విద్యార్థులకు కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. రోటరీ నాయకులు కన్నెగంటి మురళీకృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులలో దృష్టిలోపం గుర్తించి వారికి ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించడంతోపాటు, కళ్ళజోళ్ళు కూడా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ఈదర వెంకట పూర్ణ చంద మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో గతంలో మూడు పాఠశాలలలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి దాతల సహకారంతో కళ్ళజోళ్ళు అందజేయడం జరిగిందని, ఈ దఫా తన తండ్రి పేరిట ఏర్పాటు చేసిన ట్రస్ట్ ద్వారా కళ్ళజోళ్ళు అందించడం జరుగుతుందన్నారు. దృష్టిలోపం పరీక్షల ద్వారా కళ్ళజోళ్ళు అవసరమైన విద్యార్థిని విద్యార్థులకు క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో కళ్ళజోళ్ళు అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ప్రధాన కార్యదర్శి గుమ్మడి వెంకటనారాయణ, కోశాధికారి వెంపటి హరిప్రసాద్, క్లబ్ మాజీ అధ్యక్షులుఈదర శ్రీనివాసరావు, షేక్ సుభాని, ఆలపాటి కిరణ్, వీరవల్లి శ్రీధర్, స్కూల్ హెచ్ఎం పి కరిముల్లా, డ్రాయింగ్ మాస్టర్ బెల్లంకొండ వెంకట్, మల్లాది అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై హంగామా చేసిన యువకులపై పాతగుంటూరు పోలీసులు కేసు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** పుట్టినరోజు వేడుకల పేరుతో రాత్రివేళ రోడ్లపై హంగామా చేసిన యువకులపై పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. బుధవారం రాత్రి గుంటూరు నగరంలోని పాతగుంటూరు ప్రాంతంలో కొంతమంది యువకులు బైకులు అడ్డగించి రోడ్డుపై కేక్ కట్ చేయడంతో పాటు బాణసంచా కాల్చి, గోల గలాటలు చేశారు. ఈ ఘటనతో సాధారణ ప్రజలకు అసౌకర్యం ఏర్పడటమే కాక, ప్రజా శాంతి భద్రతలకు భంగం కలిగింది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పాతగుంటూరు సీఐ వెంకట ప్రసాద్ నేతృత్వంలో పోలీసులు యువకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అనంతరం న్యాయపరంగా విచారణకు హాజరుపరిచారు. ఇలాంటి ఘటనలపై కఠిన చర్యలు తప్పవని గుంటూరు ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ హెచ్చరించారు. ప్రజా ప్రదేశాల్లో వేడుకలు జరుపుకోవాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరి అని, లేదంటే చట్ట ప్రకారం తగిన శిక్షలుంటాయని తెలిపారు. పోలీసుల అప్రమత్తతతో రాత్రివేళల రోడ్లపై అనవసర రేవెల్రీలకు చెక్ పడుతోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## శ్రీశైల దేవస్థానాన్ని దర్శించిన రాజస్థాన్ రాష్ట్ర మంత్రి కనయ్యా లాల్ చౌధరి



శ్రీశైలం(జర్నలిస్ట్ ఫైల్): శ్రీశైలంలో శుక్రవారం పుణ్యక్షేత్ర దర్శనం కోసం వచ్చిన ఘన అతిథిగా రాజస్థాన్ ప్రభుత్వ ప్రజారోగ్య, ఇంజనీరింగ్ మరియు గ్రౌండ్ వాటర్ శాఖల మంత్రి కనయ్యా లాల్ చౌధరి శ్రీ మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను కుటుంబసమేతంగా భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన అధికారి మండలి వారు శ్రీ కనయ్యా లాల్ చౌధరి గారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ పూజారులు వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక దర్శనం కల్పించి ఆశీర్వచనం అందజేశారు. అనంతరం దేవస్థానం అధికారులు మంత్రికి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీశైల దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కూడా మంత్రిగారు పరిశీలించారు. ఆలయ పరిపాలన, భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలపై దేవస్థాన అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ం "శ్రీశైల క్షేత్రం పవిత్రతతో పాటు ప్రాచీనతకు ప్రతీకగా నిలుస్తోంది. ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మికశాంతి లభిస్తుంది. దేవస్థాన పరిపాలన మెరుగ్గా ఉందని అభినందనలు తెలియజేస్తున్నాను" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజస్థాన్ అధికార బృందంతో పాటు దేవస్థాన ఈవో, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు ఉద్యోగుల రిటైర్మెంట్ పై ఆందోళన

- గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని సెకండ్ ఎఎన్ఎం యూనియన్ డిమాండ్


ఆంధ్రప్రదేశ్‌లో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్టు ఉద్యోగుల రిటైర్మెంట్లు ప్రారంభమయ్యాయి. అయితే, ఎలాంటి గ్రాట్యూటీ లేదా రిటైర్మెంట్ ప్రయోజనాలు లేకుండా ఉద్యోగులను పదవీ విరమణ చేయడంపై రాష్ట్రంలోని సెకండ్ ఎఎన్ఎం ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ప్రకాశం జిల్లాలో వడ్లమూడి పీహెచ్‌సీ పరిధిలోని పల్లమల్లె సబ్‌సెంటరులో గత 20 సంవత్సరాలుగా ఆరోగ్య సేవలు అందించినజి. రమణమ్మను జూలై 31, 2025న ప్రభుత్వాధికారులు రిటైర్ చేసినా, ఆమెకు ఎటువంటి నష్టపరిహారం లేకుండా ఇంటికి పంపించిన తీరుపై ఉద్యోగ సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 22 వేల మంది ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను తీవ్ర కలవరానికి గురి చేస్తోంది.

ఈ నేపథ్యంలో, ఎపి స్టేట్ గవర్నమెంట్ సెకండ్ ఎఎన్ఎం ల యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ స్పందిస్తూ, ప్రభుత్వం మానవతా దృష్టికోణంతో తక్షణమే స్పందించి రిటైర్ అయిన జి. రమణమ్మకు గ్రాట్యూటీతో పాటు ఆర్థిక సహాయాన్ని అందించాలని విజ్ఞప్తి చేసింది. పదేళ్లకు పైగా కాంట్రాక్టు విధానంలో సేవలందించిన సెకండ్ ఎఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయకుండా, జీవితాంతం పని చేసిన అనంతరం వట్టి చేతులతో ఇంటికి పంపించడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుండి గ్రామీణ, గిరిజన, పట్టణ ప్రాంతాల్లో పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ముందుండే సెకండ్ ఎఎన్ఎంలు, కోవిడ్ వంటి సంక్షోభ సమయంలో సైతం ప్రాణాలకు తెగించి సేవలు అందించారు. అయినప్పటికీ, నేటికీ వారికి ఉద్యోగ భద్రత లేకుండా, తగిన వేతనాలు లేకుండా ప్రభుత్వం విరమింపజేస్తోందని సంఘం వాపోయింది. నేషనల్ హెల్త్ మిషన్‌లో రెగ్యులర్ ఉద్యోగుల సరసన సేవలందించిన వారికీ తగిన గౌరవం, వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకపోవడం తీవ్రంగా ఖండించదగిన విషయం అన్నారు. వృద్ధాప్యంలో కూడా ఉద్యోగ భద్రత లేకుండా, రీడిప్లాయిమెంట్ పేరుతో దూర ప్రాంతాలకు బదిలీలు చేయడం మహిళా ఉద్యోగులపై మానసిక ఒత్తిడిని కలిగిస్తోందన్నారు. వారి స్వస్థలాలకు తిరిగి పంపించాలని, పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని, అలాగే తగిన మానవీయ ప్రమాణాలతో విధులు పూర్తి చేసిన వారికి రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించాలని సంఘం డిమాండ్ చేసింది. ఈ ప్రకటనను ఏ.వి. నాగేశ్వరరావు (గౌరవాధ్యక్షుడు), ఎం. స్వాతి (అధ్యక్షురాలు), కె. రవీనాజ్యోతి (ప్రధాన కార్యదర్శి), ఎం. నారాయణమ్మ (కోశాధికారి)లు సంయుక్తంగా విడుదల చేశారు.

## అష్టలక్ష్మీ సేవలో తరించిన మహిళా భక్తులు



తెనాలి,(జర్నలిస్ట్ ఫైల్) శ్రావణమాస ప్రాధాన్యత క్రమంలో పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో శ్రావణమాస రెండవ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని త్రిదండి పీఠంలోని అష్టలక్ష్మి ఆలయంలో, ఆలయ అర్చక స్వామి చక్రవర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రావణమాసం అందిన రెండవ శుక్రవారం కావడంతొ, మారీస్ పేటలోని చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో, శ్రీ బాలా త్రిపుర సుందరి అమ్మవారికి గజలక్ష్మి అలంకారంతో పూజలు నిర్వహించారు. అదేవిధంగా రామలింగేశ్వరపేటలోని, శ్రీ దుర్గా పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి సన్నిధానంలో, దుర్గమ్మ వారికి, నూట ఒక్క ఎర్ర కలువలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలాజీ రావు పేట శివారు ప్రధాన అయ్యప్ప దేవాలయంలోని దుర్గాదేవి సన్నిధానంలో, మహిళా భక్తులు విశేషంగా సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అర్చక స్వామి దుర్భ హరిబాబు శాస్త్రి పరివేక్షణలు పూజా విధులు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఈ శ్రావణమాసంలో ఐదు శుక్రవారం రావడంతో, మూడవ శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని ప్రధాన వ్యాపార కూడలిలో సీజనల్ వ్యాపారం చేసుకునే వ్యాపారులు, ప్రధానంగా పూలు,పళ్ళు, కొబ్బరికాయల వ్యాపారులు, భక్తుల నమ్మకాన్ని అడ్డుపెట్టుకుని, రేట్లు విపరీతంగా పెంచేసి, విక్రయించే తీరు, సాధారణ మధ్యతరగతి కుటుంబాల వారికి పెను భారంగా ఉందనే చెప్పాలి. కంటికి ఇంపైన కొబ్బరికాయ దేవుడికి సమర్పించాలంటే, యాభై రూపాయలు, అ-రటిపళ్ళు డజను వంద, ఇలా పూజ అవసరాలకు కావలసిన వస్తువుల ధరలు చుక్కలు చూస్తున్నాయి. శ్రావణమాసం మొత్తానికి సెంటిమెంట్ వ్యాపారులకు కలిసి సోచ్చేకాలంగా మారింది.



# పునరుజ్జీవం దిశగా మానససరోవర్

- పీపీపీ విధానంలో అభివృద్ధి ప్రయత్నాలు
- కూటమి ప్రభుత్వ చొరవకు ప్రజల్లో విశేష స్పందన



గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :గుంటూరు శివారులోని ఎన్టీఆర్ మానససరోవర్ పునరుజ్జీవానికి కూటమి ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. ప్రజల నివాసాలు పెరుగుతున్న వేళ, ప్రకృతి సౌందర్యానికి, పర్యాటక అభివృద్ధికి, ఆరోగ్యవంతమైన వాతావరణానికి మానసరోవర్ మళ్లీ కేంద్రబిందువుగా మారేలా ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. శుక్రవారం మానసరోవర్ ప్రాంతాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి మరియు సమాచార శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుడు మహమ్మద్ నసీర్ అహ్మద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ – "కూటమి ప్రభుత్వం అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని, గుంటూరు చుట్టుపక్కల ప్రాంతాల రూపురేఖలు మార్చేందుకు కృషి చేస్తోంది. మానసరోవర్ మళ్లీ గర్వకారణంగా మారాలి. ఇది పర్యావరణ పరిరక్షణకు, పర్యాటకానికి, ప్రజల జీవనశైలిలో మార్పుకు మార్గనిర్దేశకంగా ఉండాలి" అని తెలిపారు. తెలుగుదేశం హయాంలో అభివృద్ధి చెందిన ఈ ప్రదేశం, తరువాతి ప్రభుత్వాల కాలంలో నిర్లక్ష్యం పాలై, మురికితో నిండిపోయిందని, పిచ్చిమొక్కలతో కప్పబడి, నీరు కరువై, రహదారులు మూసుకు పోయాయని గుర్తుచేశారు. ఒకప్పుడు విజయవాడ నుంచి కూడా కుటుంబాలు వచ్చి వీక్షణ చేసేవారని పేర్కొన్నారు. ప్రస్తుతం సుమారు 50 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ చెరువును స్థిరమైన ప్రణాళికతో అభివృద్ధి చేయాలన్నదే ప్రభుత్వ ఆలోచన. ప్రభుత్వాలు మారినా అభివృద్ధి పనులు నిలవకుండా ఉండాలంటే ప్రైవేట్ భాగస్వామ్యంతో పని చేయాల్సిన అవసరం ఉందని, అందుకే ప్రజా–ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో (పిపిపి) ఈ ప్రాజెక్టును అమలు చేయాలని నిర్ణయించామన్నారు. ఈ దిశగా గుంటూరు మహానగరపాలక సంస్థ ద్వారా ఆసక్తి వ్యక్తీకరణ ప్రక్రియ ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని వెల్లడించారు. ప్రణాళికలు, పెట్టుబడులపై ఆసక్తి కలిగిన సంస్థలు, దాతలు, బంగారు కుటుంబాలవారు – మేయర్ లేదా కమిషనర్‌కు తమ ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. "చంద్రబాబు ప్రతి నియోజకవర్గంలో ఐదు లేదా ఆరు ముఖ్య ప్రాజెక్టులను ఈ విధంగా అభివృద్ధి చేయాలన్న దిశగా సూచనలిచ్చారు. మేము కూడా ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాధాన్యత కలిగిన ప్రదేశాలపై దృష్టి పెడుతున్నాం. మానసరోవర్ అభివృద్ధి చుట్టుపక్కల ప్రాంతాలకు మార్గదర్శకంగా నిలుస్తుంది" అని మంత్రి స్పష్టం చేశారు.

**ఎమ్మెల్యే నసీర్ వ్యాఖ్యలు:**

తూర్పు నియోజకవర్గంలో ఎక్కువ మంది పేదలు, మధ్యతరగతి వర్గాలు నివసిస్తున్నాయని, వారికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. "పిపిపి విధానంతో అభివృద్ధి పనులు త్వరితగతిన ముందుకు సాగవచ్చని మేము నమ్ముతున్నాం. అందరూ కలిసి మానసరోవర్‌ను మళ్లీ ప్రజల ప్రియమైన పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుతాం" అని హామీ ఇచ్చారు.

## ఆర్టీసి స్థలాన్ని లులూకు కేటాయిస్తూ ఇచ్చిన జీఓ 137 ను రద్దుచేయాలి...ఇ.యు

- లులూకి ఇచ్చే జీఓ ను అడ్డుకొనేందుకు ఆర్టీసి లో జేఏసి ఏర్పాటుకు కృషిచేస్తున్నాము.



విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్): జయవాడ నగరం నడిబొడ్డులో ఉన్న ఏపియస్ ఆర్టీసి గవర్నర్ పేట 1&2 డిపోలకు సంబందించి న మరియు పాతబస్సుస్టాండ్ కు సంబందించిన స్థలం తో పాటు ఈ పాత బస్సుస్టాండు స్థలాన్నే గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో లిఅర ఎకరా స్థలంలోలి ఏర్పాటుచేసిన మున్సిఫల్ పార్కు స్థలంతో పాటు 4.15 ఎకరాలు సుమారు నాలుగువందలకోట్ల రూపాయలు విలువ చేసే స్థలాన్ని లిలులూ షాఫింగు మాల్‌లి కు ప్రభుత్వం కట్టబెట్టి ప్రజలకు అందుబాటులో ఉన్న ప్రజారవాణా డిపోని దూరం చేస్తూ ఇచ్చిన లిజిఓఃయం. యస్ఃనెంః137 ను రద్దులి చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గవర్నర్ పేట 1&2 డిపో ఉద్యోగుల ఆద్వర్యంలో ఉద్యోగులను చైతన్య పర్చేందుకు గేటు మిటీంగు నిర్వహించారు.

ఈ సమావేశంలో ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఆర్టీసి ఇ.యు విజయవాడ జోన్ జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ గవర్నర్ పేట డిపోలకు 1&2 మరియు పాత బస్సుస్టాండు స్థలాన్ని 1959 లో గజం రూః16 లు చొప్పున సుమారు నాలుగు లక్షలు ఆరువేల రూపాయలకు ప్రభుత్వం కేటాయించిన రేటు కు ఆర్టీసి యాజమాన్యం ప్రభుత్వానికి డబ్బులు చెల్లించి కొనుగోలు చేసిన స్థలాన్ని ప్రభుత్వం ప్రవేటు వ్యాపార వేత్తలుకు దారాతత్తం చేసేందుకు తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేఖంగా కలసి కట్టుగా లిజేఏసిలి గా పోరాడి ఆర్టీసి ఆస్తు లను కాపాడుకుందామని ఆర్టీసిలో ఉన్న సంఘా లలో ఎన్ఎంయూఏ మరియు ఎస్‌డబ్ల్యూఎఫ్‌తో పాటు ఇతర సంఘాలకు గురువారమే లేఖలు రాసామని భవిష్యత్ లో రాష్ట్రకమిటి ఆదేశాల మేరకు ఆర్టీసి ఆస్థులను కాపాడుకొనేందుకు ఎప్పుడు ఎలాంటి పోరాటాలు ఇచ్చినా సిద్దంగా ఉండాలని ఏపిపిటిడీ (ఆర్టీసి)ఎంప్లాయీస్ యూనియన్ విజయవాడ జోన్ జోనల్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు ఉద్యోగులకు పిలుపు నిచ్చారు.

## శ్రీశైల దేవస్థానంలో పరిచారకుడు రెహమత్ విద్యాధర్ అరెస్ట్..!

- శ్రీ మల్లికార్జున స్వామివారి ఆలయంలో క్లాత్ హుండీ లో దొంగలించిన సొమ్ము సుమారు రూ.3,79,200/ ..!




శ్రీశైలం(జర్నలిస్ట్ ఫైల్): శ్రీశైల దేవస్థానంలో శ్రీ స్వామి వారి ఆలయం నందు తేది 16.07.2025న తెల్లవారుజామున 02:20 గంటల సమయంలో దేవస్తానం పరిచారకుడు హిరెమత్ విద్యాధర్ శ్రీశైలం దేవస్థానం లో శ్రీ మల్లికార్జున స్వామి వారి గర్భగుడి ముందు గల హుండిలో కొంత డబ్బును దొంగలించినారు అని యం. మల్లికార్జున, శ్రీశైల దేవస్థానం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వెంటనే దర్యాప్తు చేపట్టిన శ్రీశైలం సర్కిల్ ఇన్స్పెక్టర్, ముద్దాయి హిరెమత్ విద్యాధర్ శ్రీశైలం దేవస్థానం నందు 2006 సం. నుండి కాంట్రాక్టు బేసిస్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు.

గత 2 సం.ల నుండి శ్రీ మల్లికార్జున స్వామి వారి గుడి నందు పనిచేయుచున్నాడు. హిరెమత్ విద్యాధర్ జల్సాలకు అలవాటు పడి, చెడు వ్యసనాలకు బానిసై వచ్చే జీతం సరిపోక, శ్రీ మల్లికార్జున స్వామి వారి గుడి నందు డ్యూటీలో చేరిన 06 నెలల నుండి అనగా ఇప్పటికి దాదాపుగా 18 నెలల ముందు నుండి డ్యూటీ సమయం కంటే సుమారు ఒక అరగంట ముందుగా గుడికి వెళ్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి హారతికి కావాల్సిన పనులు చూడాలని వెళుతూ, స్వామి వారి గర్భగుడి ముందర రత్నగర్భ గణపతి స్వామివారి పక్కన ఉన్న క్లాత్ హుండీలో భక్తులు కానుకల రూపంలో వేసిన నగదును సమయం కుదిరినప్పుడల్లా దొంగలించేవాడు అని, ఇలా ప్రతిసారి దొంగలించినప్పుడల్లా సుమారు రూ. 10,000 నుండి 20,000 వరకు దొంగలించేవాడని . ఆవిధంగా ఇప్పటివరకు దొంగలించిన సొమ్ము అతని వద్ద సుమారు రూ1,24,200/- ను చూపించి, మిగతా కొంత డబ్బు తో రాయల్ ఎన్ఫెల్డ్ కంపెనీ కు చెందిన బులెట్ బైక్ కొన్నాడు దానికి రూ1,55,000/- డబ్బు కట్టినానని, రూ. 1,00,000/- తో అతను ఉంటున్న ఇంటికి మరమత్తులు వాడుకోవడమైనది అని చెప్పినాడు. హిరెమత్ విద్యదర్ మొత్తం రూ3,79,200రూ/- (మూడు లక్షల డెబ్బై తొమ్మిది వేల రెండు వందల రూపాయలు) శ్రీ మల్లికార్జున స్వామి వారి క్లాత్ హుండీ లో దొంగిలించినాడు అని. నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రానా ఐఏఎస్ ఆదేశాలు మేరకు ఆత్మకూరు డి.ఎస్.పి రామంజి నాయక్ సూచనలు మేరకు శ్రీశైలం సిఐ జి.ప్రసాద రావు, సిబ్బంది రఘునాధుడు, బాలక్రిష్ణ, రాజేంద్ర కుమార్, వెంకట నారాయణ, నాను నాయక్ ముద్దాయి హిరెమత్ విద్యాధర్ ను 2025 సం "ఆగష్టు నెల 01 తేదీన 11:30 ఉదయం శ్రీశైలంలో జగద్గురు మటం వద్ద అరెస్ట్ చేసి ముద్దాయి హిరెమత్ విద్యాధర్ వద్ద నుండి శ్రీ మల్లికార్జున స్వామి వారి క్లాత్ హుండీ లో దొంగిలించిన నగదు సుమారు రూ1,24,200/- మరియు దొంగిలించిన నగదు తో కొన్న రాయల్ ఎన్ఫెల్డ్ బులెట్ స్వాదీనం చేసుకోవడమైనది అని, ముద్దాయి హిరెమత్ విద్యాధర్ ను రిమాండ్ నిమిత్తం ఆత్మకూరు కోర్ట్ కు పంపడమైనది అని ప్రసాద్ రావు సిఐ మీడియాకు తెలిపారు.

## సచివాలయంలో మాజీ ఉద్యోగ నేత పునర్నియామకానికి లక్షల్లో డీల్ !

- రీ-ఎంప్లాయిమెంట్ పేరుతో మున్సిపల్ శాఖలో కీలక వ్యక్తి జోరుగా బేరసారాలు
- రాష్ట్ర సచివాలయం ఉద్యోగుల్లో హాట్ టాపిక్ గా మారిన 'పునరావాస భేరసారాలు'




అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్ర పరిపాలనా కేంద్రంగా ఉన్న ఏపీ సచివాలయంలో పదవీ విరమణ పొందిన ఓ మాజీ ఉద్యోగ నేత రీ-ఎంప్లాయిమెంట్ డీల్‌లో భాగంగా తిరిగి ఉద్యోగంలోకి రాబోతున్నారనే వార్తలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. పదవీ విరమణ చేసిన అతడికి మునిసిపల్ శాఖలో పునరావాసం కల్పించేందుకు లక్షల్లో డీల్ కుదిరిందని సమాచారం సచివాలయం ఉద్యోగుల్లో ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది.

సచివాలయ ఉద్యోగుల సమాచారం ప్రకారం... గత కొన్ని రోజుల క్రితం 62 ఏళ్ల వయసులో అదనపు కార్యదర్శి హోదాలో రిటైర్ అయిన ఆ ఉద్యోగి రీ-ఎంప్లాయిమెంట్ డీల్‌లో భాగంగా తిరిగి ఉద్యోగంలోకి రావాలని ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. గతంలో సాధారణ పరిపాలన శాఖ, సీఆర్‌డీఏ అతడి పునరనియామక ప్రతిపాదనను తిరస్కరించినా%% ఇప్పుడు మున్సిపల్ శాఖలోని ఓ కీలక వ్యక్తి సహకారంతో టిడ్కో/ ఏపీ ఆర్.ఎస్.సీ.ఎల్ లో పునరావాసం కల్పించే యత్నాలు జరుగుతున్నాయని విశ్వసనీయ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

**జీతం టిడ్కో / ఏపీ ఆర్.ఎస్.సీ.ఎల్ ద్వారా.. పెత్తనం సచివాలయంలో?**

అయితే ఈ రీ-ఎంప్లాయిమెంట్ డీల్‌లో భాగంగా టిడ్కో/ఏపీ ఆర్.ఎస్.సీ.ఎల్ పేరిట జీతం చెల్లించి, సచివాలయంలోనే కార్యకలాపాలను నడిపేలా స్కెచ్ వేయబోతున్నారని సమాచారం. అయితే ఈ వార్త బయటకు పొక్కడంతో ఉద్యోగుల్లో తీవ్రమైన అభ్యంతరం వ్యక్తమవుతోంది. గతంలో ఆయన అవినీతి తిమింగలంగా సెక్రటేరియట్ వర్గాల్లో పేరొందిన సంగతి ఇప్పుడు మళ్లీ వెలుగులోకి వచ్చింది. "ఆయనతో కలిసి పనిచేయలేమంటూ" పలువురు ఉద్యోగులు బహిరంగంగానే ప్రకటిస్తున్నారు.

**ఏ నైపుణ్యంతో పునరావాసం?**

"ఆ రిటైర్డ్ ఉద్యోగికి మున్సిపల్ శాఖ, హౌసింగ్, అర్బన్ ప్లానింగ్ రంగాల్లో ఎలాంటి ప్రత్యేక నైపుణ్యం ఉంది? ఆమోదించదగిన అనుభవం లేదా ప్రాజెక్ట్ పరంగా విశేష కృషి ఉందా?" అని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. లక్షల రూపాయాల డీల్ ద్వారా వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రభుత్వ వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**టీడీపీ వర్గాల్లో కూడా అసహనం**

ఈ వ్యవహారంపై టీడీపీ వర్గాలు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. "2014-19 మధ్య సెక్రటేరియట్ ఉద్యోగ చంద్రబాబు నాయుడు ద్వారా అమితమైన మేలు పొందినప్పటికీ , జగన్ హయాంలో ఉద్యోగులపై జరిగిన అన్యాయాలపై ఒక్కమాట మాట్లాడలేదు. 43 శాతం ఫిట్‌మెంట్‌ను చంద్రబాబు ఇచ్చినప్పుడు కూడా స్పందించలేదు. ఇటీవల పట్టభద్రుల ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థికి ఇబ్బందులు తలెత్తేలా వ్యవహరించారు" అని

## ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ నామినేసన్ల స్వీకరణ గడువు 15 ఆగష్టు 2025 వరకు పొడగింపు

- అసాధారణ ప్రతిభా విజయాలు కలిగిన చిన్నారులకు ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్
- ప్రతిష్టాత్మక జాతీయ అవార్డును బహుకరంచనున్న భారత ప్రభుత్వం
- కేంద్ర ప్రభుత్వ మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి త్రిప్తి గుర్హ

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) : వివిధ రంగాలలో పిల్లల అసాధారణ విజయాలను గుర్తించి వారిని అభినందించడానికి భారత ప్రభుత్వం ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ వంటి ప్రతిష్టాత్మక జాతీయ అవార్డును బహుకరంచనుందని కేంద్ర ప్రభుత్వ మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి త్రిప్తి గుర్హ తెలిపారు. యువతకు మార్గదర్శకత్వం వహించడానికి ఏర్పాటు చేయబడిన ఈ అవార్డును ధైర్యం, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళ & సంస్కృతి మరియు సైన్స్ & టెక్నాలజీ అనే నాలుగు విభాగాల కింద అందించనున్నది. ఈ రంగాలలో నైపుణ్యం మరియు అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించిన 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు (జూలై 31, 2025 నాటికి) నామినేట్ కావడానికి అర్హులని త్రిప్తి గుర్హ పేర్కొన్నారు.

ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డు ఎంపిక ప్రక్రియను చేపట్టడానికి కేంద్ర ప్రభుత్వంలోని అన్ని మంత్రిత్వ శాఖలు/విభాగాలు, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు మరియు ఇతర సంబంధిత సంస్థల నుండి నామినేషన్లను స్వీకరిస్తారని, PMRBP నామినేషన్లు/సిఫార్సులు ఆన్‌లైన్‌లో భారత ప్రభుత్వం రూపొందించిన రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్ (https://awards.gov.in) ద్వారా మాత్రమే స్వీకరించబడతాయని త్రిప్తి గుర్హ స్పష్టం చేసారు.

ప్రతి సంవత్సరం పెద్ద సంఖ్యలో నామినేషన్లు అందుతున్నప్పటికీ, అర్హులైన చాలా మంది పిల్లలు ప్రజల్లో గుర్తింపు కోరుకోకపోవడంతో వారి ప్రతిభ కనుమరుగవుతుందని, కావున సాధ్యమైనంత ఎక్కువగా అర్హులైన పిల్లలను గుర్తించడంలో సమిష్టి ప్రయత్నాలు చేయాలని మరియు వారికి అనుకూలంగా తగిన నామినేషన్లు చేయాలని కేంద్ర ప్రభుత్వ మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ కోరుతున్నది.

PMRBP కోసం నామినేషన్లను సులభతరం చేయడానికి ఒక్కో విభాగం కొరకు ఒక్కో ప్రత్యేక లాగిన్ ID లను కేటాయించబడిందని, సిఫార్సులను ఖరారు చేసేటప్పుడు, ఈ క్రింది అంశాలను నిర్ధారించుకోవాలని సూచించారు.

1. సిఫార్సు చేయబడిన పిల్లలు జాతీయ స్థాయి అవార్డుకు అర్హులా కాదా, వారి విజయాలలో భాగంగా ప్రజా సేవ కూడా మిళితమై ఉందా లేదా అని పరిశీలన చేయాలి.
2. బాలికలు, బలహీన వర్గాలు, SC/ST సంఘాలు మరియు దివ్యాంగుల నుండి ప్రతిభావంతులైన పిల్లలను గుర్తించడానికి ప్రత్యేక ప్రయత్నాలు చేయాలనీ త్రిప్తి గుర్హ సూచించారు.

PMRBP కోసం ఆన్‌లైన్ నామినేషన్లు/సిఫార్సులు 1 ఏప్రిల్, 2025 నుండి ప్రారంభమయ్యాయి మరియు నామినేషన్లకు చివరి తేదీ 31" జూలై, 2025 వరకు ఉండగా నామినేషన్ల స్వీకరణ గడువు 15 ఆగష్టు 2025 వరకు పొడిగిస్తూ సంబంధిత మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కావున ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ కింద గుర్తింపు పొందాల్సిన అత్యుత్తమ విజయాలు మరియు ప్రతిభ కలిగిన పిల్లలను నామినేట్ చేయడాన్ని అన్ని శాఖల వారు ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వ మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి త్రిప్తి గుర్హ కోరారు.

## శ్రీశైలంలో అంకాళమ్మవారికి విశేష పూజలు



- లోకకల్యాణం కోసం ఘనంగా నిర్వహించిన అభిషేకం, అర్చనలు

శ్రీశైలం(జర్నలిస్ట్ ఫైల్) : శ్రీశైలం క్షేత్రంలో గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. దేవస్థానం తరఫున ప్రతి శుక్రవారం సర్కారీ సేవగా నిర్వహించే ఈ విశేష పూజలు భక్తుల సాక్షిగా శోభాయమానంగా ముగిశాయి. కార్యక్రమం ఉదయం మహాగణపతిని పూజించి ప్రారంభమైంది. అనంతరం అర్చకస్వాములు లోకకల్యాణాన్ని ఆకాంక్షిస్తూ సంకల్పం పఠించి, శ్రీ అంకాళమ్మవారికి పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, జలంతో అభిషేకాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయాన్ని పుష్పాలతో అలంకరించి, కుంకుమార్చన, విశేష అర్చనలు జరిగాయి. శ్రీ అంకాళమ్మ ఆలయం శ్రీశైలం ప్రధాన ఆలయానికి ఎదురుగా, రహదారి చివరలో కుడివైపు ఉత్తరముఖంగా ఉండి, క్షేత్ర గ్రామదేవతగా భక్తుల విశ్వాసానికి కేంద్రబిందువుగా నిలుస్తోంది. చతుర్భుజాలతో అలంకరించబడిన దేవి కత్తి, డమరుకం, పానపాత్ర, త్రిశూలం ధరించి, కిరీటంతో, వస్త్రాభరణాలతో, కర్ణాభరణాలు, కంఠాభరణాలతో భక్తులకు దర్శనమిచ్చారు. విపత్కర సమయాల్లో కూడా భక్తులను కాపాడే శక్తిగా పూజించబడే అంకాళమ్మవారు, ప్రకృతి శక్తుల సాక్షాత్కార స్వరూపమని దేవీ భాగవతం స్పష్టం చేస్తుంది. ఈ తాత్వికతను ప్రతిబింబించేలా, ఈ రోజు జరిగిన పూజా కార్యక్రమం భక్తులకు ఆధ్యాత్మిక పరిపూరణను కలిగించింది. కార్యక్రమం పూర్తయ్యే సరికి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. శ్రీశైల దేవస్థానం ఈ పూజకు విశేష ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది.

## వీవీఐపీల పర్యటనకు పోలీసుల పటిష్ట బందోబస్తు



- గవర్నర్, ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో విస్తృత భద్రతా ఏర్పాట్లు

గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) : వీవీఐపీ పర్యటనలు నేపథ్యంలో గుంటూరు జిల్లా పోలీస్ శాఖ విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసింది. నేడు గుంటూరు జిల్లాలోని చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని విజ్ఞాన కళాశాలలో స్నాతకోత్సవ కార్యక్రమానికి గవర్నర్ హాజరుకానుండగా, ఇదే రోజు మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీకే కన్వెన్షన్ హాలులో మరో కార్యక్రమానికి ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. వీవీఐపీ పర్యటనలకు సంబంధించి ప్రయాణ మార్గాలు, సభా ప్రాంగణాలు, వేదికల ప్రాంతాల్లో భద్రతా విభాగం సహకారంతో క్షుణ్ణంగా తనిఖీలు జరుగుతున్నాయి. సభలకు హాజరవుతున్న ప్రజలను విశ్లేషణాత్మకంగా తనిఖీ చేసిన తర్వాతే ప్రవేశం కల్పించనున్నారు. ఈ సందర్భంగా ప్రతి పోలీస్ అధికారి మరియు సిబ్బంది తమ కేటాయించిన ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అశాంతి కలగకుండా పర్యటనలు సజావుగా సాగేందుకు అన్ని విభాగాల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఆదేశించారు. వీవీఐపీ పర్యటనలు ప్రశాంతంగా పూర్తవ్వాలని, భద్రతలో ఎలాంటి లోపాలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని గుంటూరు జిల్లా పోలీసులు వెల్లడించారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467